తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం-08- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 13 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# కాళేశ్వరం పై కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొడదాం

- కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొడదాం
- రాజకీయాల కోసం మాపై బురద జల్లుతున్నరు
- ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కొట్లాడినం
- కమిషన్ విచారణకు వెళ్తాం.. తాటాకు చప్పళ్లకు భయపడం
- కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజల జీవధార..కాళేశ్వరం రైతుల కల్పతరువు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. మేడిగడ్డ బరాజ్‌లో 86 పిల్లర్లలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలినట్టుగా కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎన్డీఎస్ఏ తన నివేదికలో పేర్కొన్నట్టు బరాజ్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై నిజానిజాలను ప్రజలకు వివరిద్దామని, ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచేందుకు ప్రజా ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కొట్లాడిన తాము తాటాకు చప్పుళ్లకు భయపడబోమని స్పష్టంచేశారు. బజాప్తా కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతామని చెప్పారు. హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణభవన్‌లో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలువాస్తవాలు' అనే అంశంపై సుమారు గంటన్నరపాటు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

మిగతా 2లో..



## ఓఆర్ఆర్ లోపల కొత్త ఆటో రిక్షాలు

**అనుమతి సడలిస్తూ పరిమిత సంఖ్యలో అనుమతి ఇస్తూ ఆదేశాలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)


నగరంలో గత కొంతకాలంగా కొత్త ఆటో రిక్షాలకు పరిమితి ఉంది..కొత్త ఆటో రిక్షాలు పరిమిట్లు ఇవ్వడానికి లేదు. ఆ పరిమితిని సడలిస్తూ జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్య లో ఎలక్ట్రిక్, సిఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతి ఇస్తూ జీవో నెంబర్ 263 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు. హైదరాబాద్ నగరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుంది..

మిగతా 2లో..

## మ్యాచ్‌ఫిక్సింగ్ అంటూ రాహుల్ గాంధీ పోస్టు..

- త్వరలో బిహార్లోనూ ప్రజాస్వామ్య రిగ్గింగు
- భాజపా ఓడిపోతుందనేచోట అదే చేస్తారు
- రాహుల్ తీవ్ర ఆరోపణలు
- తోసిపుచ్చిన ఈసీ, భాజపా

5లో..





## మంత్రివర్గంలో మాకు చోటు కల్పించండి

- సీఎంకు మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీ హిల్స్ నివాసం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాదిగ సామాజిక వర్గ శాసనసభ్యులు. మంత్రి వర్గం లో తమకు అవకాశం కల్పించాలని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ని కలిసిన వారిలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ , నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులున్నారు.

## అభివృద్ధి నిధుల సమీకరణ కోసం ప్లాట్లు & ఫ్లాట్ల బహిరంగ వేలం

- నిధుల సమీకరణ & వేలం ఆవశ్యకత
- ప్రాముఖ్యత & మంజూరు.. మంత్రి వర్గ ఉపసంఘం
- నోటిఫికేషన్ ముసాయిదా.. గృహ నిర్మాణ శాఖ నిర్దేశం
- మహబూబ్‌నగర్, ఖమ్మం ప్లాట్లు
- కూకట్‌పల్లి, నాంపల్లి, హౌసింగ్ బోర్డు స్థలాలు
- సంజీవరెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్ & పార్కింగ్ వేదిక



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ఫ్లాట్లను బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి.

మిగతా 2లో..

## ఈటల అసత్యాలే చెప్పారు.. మంత్రి తుమ్మల కౌంటర్

- సబ్ కమిటీ ఉద్దేశ్యం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదు
- కేబినెట్ ఆమోద అపోహ అధికారిక రికార్డులు లేదు
- ఈటలరాజేందర్ వాగ్మూలం అబద్ధాలు, "పొంతన లేని సమాధానాలు" అని తుమ్మల వాదన
- మేడిగడ్డ & ఇతర పెండింగ్ ప్రాజెక్టులకు మాత్రమే కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



కాళేశ్వరం కమిషన్ ముందు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వాగ్మూలం అసత్యమంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్‌కు ఈటల అసత్యాలు చెప్పారు. శనివారం ఆయన సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. ఈటల ప్రస్తావించిన సబ్ కమిటీ కాళేశ్వరం కోసం వేసింది కాదని..

మిగతా 2లో..

## మేడిగడ్డ నుంచి ఐదేళ్లలో ఎత్తిపోసింది 162 టీఎంసీలే

- కాళేశ్వరం–మేడిగడ్డ బ్యారేజీ నుంచి ఐదేళ్లలో ఎత్తిన 162 టీఎమ్‌సీ నీళ్లు
- 63 టీఎమ్‌సీ వరద సమయాల్లో సముద్రంలో రిలీజ్.. 99 టీఎమ్‌సీ వాడిన్నిఎలా వివరణ?
- మెడిగడ్డ పైకి నీటిపంపిణీ.. తిప్పిపోతల పథకం వెర్సెస్ గ్రావిటీ ప్రాజెక్టులు

5లో..



## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోలు మృతి

బీజాపూర్, తెలంగాణ ముచ్చట్లు

బీజాపూర్‌లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రత బలగాల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. తెలుగు నేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కొనసాగుతుంది.



మిగతా 2లో..

## ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచింది

- ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి వారిని నిండా ముంచింది
- వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు చెల్లించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల , (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచిందని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం జగిత్యాలలో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందన్నారు. ఉద్యోగుల కు పెండింగ్ లో ఉన్న డీఏలు విడుదల చేస్తామని చెప్పి కేవలం ఒక్క డీఏ విదిల్చారని.. ప్రభుత్వం తీరుపై ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బాధపడుతున్నారని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కాళేశ్వరం పై కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొడదాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల జీవధార అయిన కాళేశ్వరంపై నిజాలు ప్రజలకు చేరాలని, కాంగ్రెస్ చేస్తుదు దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు బట్టకాల్చి తమ మీదవేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని అధికార పార్టీ నేతలు అనుకుంటున్నారని మండిపడ్డారు. రాజకీయాల కోసం తమపై బురదజల్లుతున్నారని, వాటిని ఆధారాలతోసహా ప్రజెంటేషన్ల ద్వారా తిప్పి కొట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పులపైనా, గోదావరిపై ఏపీ బనకచర్ల ప్రాజెక్టు కట్టడం ద్వారా తెలంగాణకు జరిగే నష్టంపైన కూడా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. సాగు, తాగునీళ్లు ఇచ్చి తెలంగాణ ప్రజల కన్నీళ్లు తుడిచిన కేసీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయి తెలంగాణ గొంతు పిసికే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నాడు 50టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్‌లో రిజర్వాయర్ నిర్మాణం చేపడితే భూకంపాలు వస్తాయంటూ అనేకమంది రాజకీయం చేశారని, ప్రాజెక్టు కరెంటు చార్జీల భారం అంటూ గగ్గోలు పెట్టారని, ఆఖరికి కమిషన్లకు వెళ్లి మరీ ఫిర్యాదులు చేశారని మండిపడ్డారు. కానీ ఏపీ ప్రభుత్వం గోదావరి బనకచర్ల ప్రాజెక్టులో 150టీఎంసీ సామర్థ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నదని, కానీ ఒక్కడూ దానిపై మాట్లాడడని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ నేతలు, బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కమీషన్ల పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు.



కాళేశ్వరం కింద ఒక్క ఎకరా పారలేదని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 50 వేల ఎకరాలు మాత్రమే సాగు అయిందని చెప్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఇంకో కాంగ్రెస్ నాయకుడేమో లక్ష ఎకరాలే పారిందని, ఇలా ఎవరి ఇష్టమొచ్చినట్టు వారు, ఒక్కో నాయకుడు ఒక్కో లెక్క చెప్తున్నారని మండిపడ్డారు. 2014 ముందు వరకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనే ఉన్నదని, మరి అప్పుడు ఇంత పంట ఎందుకు పండలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం నీళ్లతో ఇప్పటి వరకు నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందిందని హరీశ్‌రావు స్పష్టంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేశామని, మిడ్ మానేర్ నుంచి ఎల్‌ఎండీకి నీళ్లు తెచ్చి, ఎల్‌ఎండీ ద్వారా ఎస్సారెస్పీ స్టేజ్ 1కు నీళ్లిచ్చామని గుర్తుచేశారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరందించినట్టుం చెప్పారు. కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడింది కేసీఆర్ ప్రభుత్వమని, ఇది నీటిపారుదలశాఖ అధికారులిస్తున్న వాస్తవమైన రిపోర్టు అని తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదని అన్నారు. సీబీఐ, ఈడీ తరహాలో ఎన్డీఎస్ఏ ఎన్డీఏ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. నాడు తెలుగుదేశం పార్టీలో ఉన్న రేవంత్‌రెడ్డి.. జలయజ్ఞం కాదు.. అది ధనయజ్ఞం అని.. నేడు కాంగ్రెస్ అవినీతిని వెనుకేసుకొస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తట్టెడు మట్టి ఎత్తకుండా అడ్వాన్సుల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లు స్వాహా చేసిందని ఇప్పుడు వారే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు, శాసనమండలి పక్ష నేత మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## ఓఆర్ఆర్ లోపల కొత్త ఆటో రిక్షాలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు జనాభా పెరుగుదల, ఓఆర్ఆర్ లోపల ఏర్పడిన కొత్త లేఅవుట్ల, అపార్ట్మెంట్లు ఫలితంగా పట్టణీకరణ యొక్క వివిధ సవాళ్లు తలెత్తాయి. నగరంలో జనాభాలో అపారమైన పెరుగుదల కారణంగా ఆటో రిక్షా పర్మిట్లకు డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్ నగరంలో వాయు మరియు శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడానికి, ప్రజా రవాణా మెరుగుపరచడానికి ఎలక్ట్రిక్/ ఎల్‌పీజీ / సీఎన్‌జీ ఆటో రిక్షాలను అనుమతించడం అవసరమని ప్రభుత్వం భావించింది.. ఓఆర్ఆర్ లోపల కొత్తగా 20 వేల ఎలక్ట్రిక్ ఆటో రిక్షా లకు అనుమతి 10 వేల కొత్త ఎల్‌పీజీ ఆటో రిక్షాలకు అనుమతి 10 వేల కొత్త సీఎన్‌జీ అటో రిక్షాలకు అనుమతి డీజిల్ ,పెట్రోల్ వాహనాలకు సంబంధించిన ఆటో లకు రేటిరోఫీట్మెంట్ చేసి వాటి ఇంజన్ ను ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, ఎల్‌పీజీలాగా మార్చుకోవడానికి 25 వేల వాహనాలకు అనుమతి ఇస్తూ జీవో విడుదల చేయడం జరిగింది ఇప్పటి వరకు ఉన్న డీజిల్ ,పెట్రోల్ ఆటో రిక్షాల ట్రాన్స్‌ఫర్ లేదా డీజిల్ పెట్రోల్, కొత్త ఆటో రిక్షాలకు ఓఆర్ఆర్ పరిధిలో అనుమతించబడవు.. ఈ ఎలక్ట్రిక్ వాహనాలు సీఎన్‌జీ, ఎల్‌పీజీతీసుకురావడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి ఓ ఆర్ ఆర్ లోపల ప్రజా రవాణా ను మెరుగుపరచవచ్చు.. ఎలక్ట్రిక్ , ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోలకు అనుమతి ఇచ్చి నగరంలో కాలుష్యాన్ని తగ్గించవచ్చు.... ఈ ప్రభుత్వ ఆదేశాల ద్వారా దాదాపు 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు.



## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోలు మృతి

(మొదటి పేజీ తరువాయి)

మూడో రోజు మరో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటన స్థలంలో రెండు ఏకే 47 రైఫిళ్లు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో మూడు రోజులుగా మావోయిస్టులకు, భద్రత బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. భద్రత బలగాల హిట్ లిస్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన కీలక నేతలు బండి ప్రకాష్, దామోదర్, మల్లోజుల వేణుగోపాల్, రామన్న, వాసుదేవరావు ఉన్నారు. మరోవైపు మావో కీలక నేతలు బండి ప్రకాష్, దిలీప్‌లకు ప్రాణహాని ఉందని పౌర హక్కుల సంఘాల నేతలు అంటున్నారు.

ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చే ప్రమాదం ఉందని పౌర హక్కుల సంఘం నేతలు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు నంబాల కేశవరావు, సుధాకర్ ప్రాణాలు కోల్పోయారు. నిన్న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన మైలారపు ఆడేళ్లు అలియాస్ భాస్కర్ ప్రాణాలు కోల్పోయారు.

ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు సహా పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో సెర్చింగ్ జరుగుతుంది. పాము కాటు, తేనెటీగల దాడిలో కొందరు జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. డీహైడ్రేషన్‌తో మరి కొందరు జవాన్లకు అస్వస్థతకు గురయ్యారు. బలగాల ఆపరేషన్ ముగిసిన తర్వాత సమగ్ర సమాచారం తెలియ చేస్తామని బీజాపూర్ ఎస్పీ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అధికార పార్టీ నాయకుల దౌర్జన్యం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

భూమి లాక్కున్నారని, న్యాయం కావాలని పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ముందు 40 డిగ్రీల ఎండలో దివ్యాంగుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశాడు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రూపాని సాలయ్య కు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. 2009లో అదే గ్రామానికి చెందిన చింత మహేందర్ వద్ద 5.20 ఎకరాలు కొనుగోలు చేసి తన భార్య రూపాని యాదమ్మ పేరుపై కొడకండ్లలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. కొన్ని రోజులు భూమి సాగు చేశాక ఆర్థిక పరిస్థితి రీత్యా వడ్డెర కులవృత్తి నిమిత్తం ఉపాధి కోసం ఇతర ప్రదేశాలకు వలస వెళ్లారు. ఇదే అదనగా భావించిన మల్లంపల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతం వెంకన్న భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. భూమి పోతుందనే మనోవేదనతోనే సాలయ్య గత రెండు ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడని భార్య యాదమ్మ వాపోయారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తీసుకోవడం లేదని, రాజీవ్ గాంధీ నీవైన నీ పార్టీ నాయకుల మనసు మార్చి న్యాయం జరిగేలా చూడాలని ఆయన విగ్రహం ముందు కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశాడు.

## ఈటల అసత్యాలే చెప్పారు.. మంత్రి తుమ్మల కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

wwమేడిగడ్డకు అనుమతులు ఇచ్చిన తర్వాత కమిటీ వేశారన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు, సబ్ కమిటీకి సంబంధం లేదని తుమ్మల స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులపై మాత్రమే సబ్ కమిటీ వేశారు. నేనే సుమోటోగా కమిషనర్ దగ్గరకు వెళ్లాలనుకుంటున్నా. సబ్ కమిటీ నిర్ణయాలను కమిషన్ ముందు ఉంచుతా'' అని తుమ్మల తెలిపారు.

''చాలా రోజులు అయింది కాబట్టి అనాలోచితంగా ఇచ్చారో తెలీదు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు సంబంధం లేని, పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. కాళేశ్వరం నిర్మాణం కోసం ఏర్పాటు కోసం వేసిన సబ్ కమిటీ కాదు. మేడిగడ్డ, ప్రాణహిత, కడ్కో పెండింగ్ ప్రాజెక్టులపై సబ్ కమిటీ వేశారు. కాళేశ్వరంపై సబ్ కమిటీ లేదు.. రిపోర్ట్ ఇవ్వలేదు. సబ్ కమిటీకి.. కాళేశ్వరం నిర్మాణానికి సంబంధం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం పొందినట్లు ఈటల రాజేందర్ చెప్పారు.. అది వాస్తవం కాదు. కేబినెట్ ముందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఎప్పుడూ రాలేదు. కేబినెట్ ఆమోదానికి కాళేశ్వరం ఏ రోజూ రాలేదు'' అని తుమ్మల పేర్కొన్నారు.



ఈటలకు తప్పుడు ఆలోచన ఎందుకు వచ్చిందో తెలీదు. 43 ఏళ్లుగా పద్ధతితో, నిబద్ధతతో రాజకీయాలు చేస్తున్నాను. నా వ్యక్తిత్వం ఈటల రాజేందర్‌కు తెలుసు. ఈటల రాజేందర్ స్టేట్‌మెంట్ చూశాక కొంత బాధేసింది. ఈటల రాజేందర్ ఇలా అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఏం వచ్చిందో తెలీదు. సబ్ కమిటీ రిపోర్ట్‌ను కమిషన్‌కు ఇస్తాను. నాకు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదు. ఈటల రాజేందర్ వాంగ్మూలం చాలా బాధాకరం'' అని తుమ్మల వ్యాఖ్యానించారు.

## అభివృద్ధి నిధుల సమీకరణ కోసం
# ఫ్లాట్లు & ఫ్లాట్ల బహిరంగ వేలం

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీ డా. జ్యోతి బుద్ధ ప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ శ్రీ వి.పి. గౌతంలు, సిద్ధం చేసిన ప్రతిపాదనలకు వనరుల సమీకరణలపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ నెల 20 వ నాటికి ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ను విడుదల చేయాలని,అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాలలోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తి అయిన, పాక్షికంగా పూర్తి అయిన అపార్ట్‌మెంట్లు ఫ్లాట్లతో పాటు, ఓపెన్ ఫ్లాట్లు (Plots), హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్ ఫ్లాట్లు , ఖాళీ స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఎటువంటి వివాదాలు లేని భూములు, అందుబాటులో ఉండే ధరలతో నిర్మించిన అపార్ట్మెంట్లుఫ్లాట్లను కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ సంస్థ కమిషనర్ శ్రీ వి.పి. గౌతం విజ్ఞప్తి చేశారు.

ఈ విక్రయాలతో వచ్చిన ఆదాయంతో, ఒఆర్ఆర్ పరిసరాల్లోనూ, ఇతర జిల్లాల్లోనూ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా హౌసింగ్ పథకాలను చేపట్టాలని భావిస్తున్నారు. వీటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అదికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



రాజీవ్ స్వగృహకు సంబంధించినంత వరకు గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో (ఒక్కో దానిలో సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉన్న టవర్ ను యూనిట్ గా) ఏక మొత్తంగా విక్రయించనున్నారు. బిల్డర్లు, ఒక గ్రూప్ గా ఏర్పడి కొనుగోలు చేయాలనుకున్న వారితో పాటు, హౌసింగ్ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు, బహుళ అంతస్తుల భవనాల అవసరం ఉన్న సంస్థల, వంటి వారు తీసుకునేందుకు వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు.

వేలం వేయనున్న వాటి వివరాలు ఇలా ఉన్నాయి రాజీవ్ స్వగృహకు చెందిన వాటి వివరాలు రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కుర్మల్ గూడలో 20, చందానగర్ లోని 3 ఒపెన్ ఫ్లాట్లు , బండ్లగూడలో 159 పూర్తి అయిన ఫ్లాట్లు, మేడ్చల్‌మల్కాజ్ గిరి గాజులరామారం లోని 5 టవర్లలోని పూర్తి కాని కట్టడాలు, పోచారం లోని పూర్తి అయిన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధ రకాల ఫ్లాట్లు, బహదూర్ పల్లిలోని 69 ఓపెన్ ఫ్లాట్లు ఉన్నాయి.

మహబూబ్ నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111 , అమిస్తపూర్ లోని 45 ఓపెన్ ఫ్లాట్లను విక్రయించడానికి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.ఖమ్మం జిల్లాలో పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతో పాటు, 3.38ఎకరాల ఖాళీ స్థలాన్ని కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.

హౌసింగ్ బోర్డు స్థలాలు

కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ (కెపిహెచ్ బి) 4 వ ఫేజ్ లో ఖాళీగా ఉన్న 7ఎకరాల 33 గుంటల విస్తీర్ణంలో ఖాళీ భూములను, అదే కాలనీలో ఉన్న రెండు ఓపెన్ ఫ్లాట్లును(4598 చదరపు గజాల విస్తీర్ణం, 2420 చదరపు గజాల స్తీర్ణం) ఈఆక్షన్ ద్వారా విక్రయించనున్నారు. అలాగే నాంపల్లి లోని 1148 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఖాళీ స్థలాన్ని, సంజీవరెడ్డి నగర్ లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్ కు చెందిన 2605 చదరపు గజాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సంజీవరెడ్డి నగర్ లోని కమ్యూనిటీహాల్ (సెల్లార్, స్టిల్ట్, జి+1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణంలో,37,070 చదరపు అడుగుల పార్కింగ్ స్థలంతో పూర్తి అయ్యే స్థితిలో ఉన్నది. ఈ భూములను ఫంక్షన్ హాల్ నిర్వహణ కోసమే వేలం వేయనున్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం-08- జూన్ 2025







# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

- **ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు :**
- **విద్యార్థులకు ఉత్తమ విద్యార్థిగా అందించేందుకు కృషి.**
- **జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత.**

**మెదక్ బ్యూరో /టేక్మాల్ తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత చదువులు చదివిన అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, దీంతో నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని ధన్నూర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన శనివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ధన్నూర గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు, బడి ఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వసంత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో కరెంటు టాయిలెట్స్ మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పాఠశాలలో చేరిన తొలి రోజునే విద్యార్థులకు ఉచిత టెక్స్ట్ బుక్స్ స్కూల్ యూనిఫామ్ తో పాటు ఈసారి ప్రభుత్వం నోట్ బుక్స్ కూడా ఇస్తున్నామని తెలిపారు. బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలలో చేర్చాలని పాఠశాలల్లో అన్ని అర్హత కలిగిన పోటీ పరీక్షలలో ఎంపికైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని.. తద్వారా పిల్లలకు మంచి విద్య బోధన అందుతుందన్నారు. అలాగే పాఠశాలలో క్రీడలతో పాటు మధ్యాహ్నం మంచి ఆరోగ్యకరమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు లక్షలు వెచ్చించి ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి ఆర్థిక ఇబ్బందులకు గురికావొద్దని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మంచి విద్యాబోధనను పొందాలని ప్రభుత్వ పాఠశాలలు ముద్దు ప్రైవేట్ పాఠశాల వద్దు అనే నినాదంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు . గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళా డ్వాక్రా గ్రూప్ సభ్యులు విద్యార్థి సంఘాల నాయకులు,యువజన సంఘాల నాయకులు బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు వసంత తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, శ్రీనివాస్ నారాయణరెడ్డి,వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.





# పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే మెరుగైన వైద్య సేవలు

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం.**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:**

చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా తీసి సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వల రిజిస్టర్, ఓపి రిజిస్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల. పనితీరు, ఆస్పత్రి సిబ్బంది సమయపాలన సీసీటీవీ కెమెరాల ద్వారా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని అందరూ కూడా సమయపాలన పాటిస్తున్నారని జిల్లా కలెక్టర్ చెప్పారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మందుల నిల్వలు సరిపడా ఉంచుకోవాలని ఆసుపత్రిలో రోగులపట్ల సమన్వయంత వ్యవహరించి చికిత్సలు అందించాలన్నారు. మలేరియా, డెంగీ ,టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం ఉన్నందున క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరీక్షలు జరిపించాలని అన్నారు. వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటించాలని కాచి చల్లార్చిన నీటి మాత్రమే తాగాలని ,ప్రజల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు





# ఖాసీంనగర్‌లో భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

మండలంలోని ఖాసీంనగర్ గ్రామంలో బక్రీద్ పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని ఈద్గా హై ఇలాహి వద్ద మౌలానా అబ్దుల్ కలాం మత బోధకుని నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ప్రభాత సమయంలోనే ప్రజలు పెద్ద సంఖ్యలో ఈద్గా వద్దకు చేరుకుని సమూహ ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతపరమైన ఉపదేశంలో మౌలానా అబ్దుల్ కలాం మాట్లాడుతూ, బక్రీద్ పండుగతో మానవ సేవ, త్యాగానికి ప్రాధాన్యత ఉందని, సమాజంలో అన్నదానంతో పాటు పేదల పట్ల కరుణ కలిగించాలని అన్నారు. పండుగ సందర్భంగా పలు మతపరమైన సందేశాలు సమాజానికి అందించారు.

ప్రార్థన అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో మహ్మద్ ఆసిఫ్, సయ్యద్ మాజిద్, సయ్యద్ గఫూర్, సయ్యద్ కలాం, సయ్యద్ కరీం, మహమ్మద్ బాదే, షేక్ గఫూర్, షేక్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు ఐక్యతకు ప్రతికలు

**పెద్దమందడిలో హిందూ, ముస్లిం ఐక్యత చాటుతూ బక్రీద్ పండుగ**

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా.. పెద్దమందడి గ్రామంలోని హిందూ యువకులు ముస్లిం సోదరులతో కలిసి ఐక్యతను చాటుతూ సోదర భావంతో సంతోషంగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో కుల మతాలకతీతంగా పండుగలు ఐక్యతకు ప్రతికగా పండుగలను జరుపుకుంటారని అన్నారు. ప్రేమ ఆప్యాయతకు నిలయమని అందరూ కలిసిమెలిసి పండుగలు జరుపుకుంటారని సంతోషం వ్యక్తం చేశారు.



# నూతన ఎస్సైని సన్మానించిన నాయకులు

**మెదక్ బ్యూరో /అల్లాదుర్గం తెలంగాణ ముచ్చట్లు:**

అల్లాదుర్గం మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శంకర్ ను బిజెపి జిల్లా నాయకులు ,అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు కంచరి బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు మద్దూరు సురేష్, మధు, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు . సందర్భంగా శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. మండల ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అదేవిధంగా వివిధ పార్టీల రాజకీయ నాయకులు పలు సంఘాల నాయకులు శాంతి భద్రతలకు సహకరించాలని ఎస్సై శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు , గోపాల్, మహేష్, విట్టల్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



# ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థిని అక్షయ

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు.**

ఎవరెస్టు శిఖరం అధిరోహించిన మారుమూల గ్రామ విద్యార్థిని కట్టే అక్షయ. వివరాల్లో కెళ్తే మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం పోచమ్మ రాళ్ల గ్రామం నిరుపేద కుటుంబం అయినటువంటి విద్యార్థి అక్షయ కీసరగుట్ట అక్కిరెడ్డిపల్లి జ్యోతిరావు బాపు పూలే స్కూల్ లో 9 వ తరగతి చదువుతుంది. చిన్నప్పటినుంచి కష్టపడే మనస్తత్వం కలిగిన అక్షయ చదువుతోపాటు తనకు గుర్తింపు రావాలని తన ప్రత్యేకతను చాటేలా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి. అందరి మన్నలను పొందుతుంది. తల్లిదండ్రులు లావణ్య, మోహన్



మారుమూల గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. తమలాగా కష్టపడకుండా కష్టపడి మంచిగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించి ఉండాలని తల్లిదండ్రులు పిల్లలను చదివిస్తున్నారు. అక్షయ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడంతో తల్లిదండ్రులు గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు.



# మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ఠ బందోబస్తు మధ్య బక్రీద్..

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.**

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:**

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని పలు మసీదుల, ఈద్గాల పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ సంధర్భంగా మెదక్ పట్టణంలోని నవబ్ పేట్ లో గల ఈద్గా వద్ద అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించగా జిల్లా ఎస్పీ పరిశీలించారు. పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లను చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ మరియు పలు అంశాల గురించి పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఆర్ఐ శైలందర్ తో పాటు పోలిసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నూతన గృహ ప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలియ జేసిన మాజీ మంత్రి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం,మోజార్ల గ్రామానికి చెందిన బీ అర్ యస్ పార్టీ కార్యకర్త వెంకటేష్ నూతన గృహ ప్రవేశ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. నూతన గృహ ప్రవేశంలో పాల్గొని వెంకటేష్ కుటుంబ సభ్యులకు మాజీమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సునీత తిరుపతయ్య, జగదీశ్వర్ రెడ్డి,కుమార్ యాదవ్,నాగేంద్ర యాదవ్, శ్రీనివాసులు,జగన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

◆ **ప్రధాన కార్యదర్శి రాముల సదానందం**

**కాజీపేటతెలంగాణ ముచ్చట్లు**

నాటి నుండి నేటి వరకు రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు తమ సంఘం నిరంతరం పోరాటం చేయాలని ఓం నమో శివాయ నమః రజక కుల సంఘం ప్రధాన కార్యదర్శి రాముల సదానందం పిలుపునిచ్చారు. కాజీపేట మండలం పరిధిలోని తరాలపల్లి గ్రామంలో ఓం నమో శివాయ నమః రజక సంఘం 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని 45వ డివిజన్ తరాలపల్లి గ్రామం లో నూతన కార్యవర్గ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సంఘానికి అధ్యక్షులుగా రాముల మహేందర్ ఉపాధ్యక్షులుగా రాముల రాజేష్ ప్రధాన కార్యదర్శిగా రాముల సదానందం కార్యదర్శిగా ఉల్లెంగుల ప్రశాంత్ కోశాధికారిగా రాముల నవీన్ కార్యవర్గ సభ్యులుగా చిరంజీవి, అరుణ్, రవీందర్, సుదర్శన్, శ్యామల, రాజమణి, రాహుల్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రాముల సదానందం మాట్లాడుతూ త్వరలోనే తరాలపల్లి గ్రామంలో నూతన రజక నూతన భవనం నిర్మాణంతో పాటు చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు జరుపుతామని వారు తెలిపారు. రజకులకు ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు

# త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగ

◆ **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు.విశ్వాసం,నమ్మకం,పరోపకారానికి, త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు జరుపుకుంటారని అన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్వగృహంలో ముస్లిం పెద్దలు,పార్టీ మైనార్టీ నాయకులకు,ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..తమాకోసమేగాక,తమ పరివరంకోసమేగాక తమ పరిసరాలు తమ చుట్టూ ఉన్న ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సహాయకారిగా,చేయుతగా ఉండడం,అవసరమైనప్పుడు త్యాగనిరతి ప్రదర్శించడం ఈ బక్రీద్ పండుగ స్ఫూర్తి అని కొనియాడారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,గంధం.పరంజ్యోతి,నాగన్న యాదవ్,చంద్రశేఖర్,కిషోర్ కుమార్ రెడ్డి,చిట్యాల.రాము,శిరీవాటి,శంకర్,వెంకటయ్య,తోట.శ్రీను తదితరులు ఉన్నారు.

# సునీల్ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం

◆ **మాజీ ఎంపి సీతారాం నాయక్**

**ములుగు,తెలంగాణ ముచ్చట్లు:**



మండలంలోని కోడిశాలకుంట గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ భూక్య సునీల్ నాయక్ దశదిన కర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు.

ఈ సంధర్బంగా మాజీ ఎంపి ప్రొఫెసర్ అజ్మీర్ సీతారాం నాయక్, టిడబ్ల్యుజెఏ రాష్ట్ర అధ్యక్షుడు భానోత్ వెంకట్ నాయక్ లు జిల్లా టిడబ్ల్యుజెఏ గౌరవ అధ్యక్షుడు, స్థానిక సాక్షి రిపోర్టర్ అయిన భూక్య సునీల్ నాయక్ దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్, వెంకట్ నాయక్ మాట్లాడుతూ "సునీల్ నాయక్ మృతి తో మీడియా రంగం లో తీరనిలోటు ఏర్పడిందని,ఆయన కుటుంబానికి మా సంఘం అన్ని విధాల అండగా ఉంటుంది. అవసరమైన స్థాయిలో సహకారం అందిస్తాం," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ తెవుజా అధ్యక్షుడు రామ్ కుమార్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి భానోత్ భాస్కర్ నాయక్, ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర పనిచేయు అధ్యక్షుడు అజ్మీర్ వెంకట్ నాయక్, సీనియర్ వార్తా ప్రతినిధులు లావుడియా రాజు నాయక్, పొరిక రాజేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాల డిపోలో హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డికి సన్మానం

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరకాల డిపోలో ఇటీవల పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ శ్రీ రామకృష్ణ నాయక్ స్థానంలో, సిరిసిల్ల డిపో నుండి బదిలీపై వచ్చిన రాజేందర్ రెడ్డి కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు లావుడియా గోవర్ధన్ నాయక్, డిపో గ్యారేజీ కార్యదర్శి ఏకే స్వామి హాజరై, రాజేందర్ రెడ్డి కి పూలమాలలు వేసి, శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ - "పరకాల డిపోలో బాధ్యతలు చేపట్టిన రాజేందర్ రెడ్డి సమర్థవంతంగా పని చేస్తారని మేము నమ్ముతున్నాం. ఆయనకు సంఘం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తాం," అన్నారు.

ఈ సందర్భంగా డిపో కార్యదర్శి ఈ.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ - "ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలి. కులమతాలకు అతీతంగా, సామాజిక సమానత్వానికి పాటుపడుతూ, సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి తగిన వాటా వేసుకోవాలి," అని పేర్కొన్నారు. అలాగే రాజేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ భరత్ కుమార్, ప్రధాన సలహాదారు పి. సూరయ్య, పనిచేయు అధ్యక్షుడు ఓ. రవీందర్, సంఘం అధ్యక్షుడు డి. మోహన్, ఖజాంచి శ్రీమతి సునీత తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



# జ్వరం మందు వికటించి చిన్నారి మృతి

**మరో నలుగురు చిన్నారులు అస్వస్థత**

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:**







జ్వరం (సిరప్) మందు వికటించి ఐదేళ్ల చిన్నారి మృతిచెందగా మరో నలుగురు చిన్నారులు అస్వస్థత గురైన సంఘటన అల్లాదుర్గంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల, బంధువుల కథనం ప్రకారం, మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం అల్లాదుర్గం గ్రామానికి చెందిన సిద్ధప్ప, భార్య సాయమ్మలకు ఐదుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ముగ్గురు ఆడపిల్లలు ఈ చిన్నారులకు జ్వరం రావడంతో శుక్రవారం రోజు ఇంట్లో ఉన్న జ్వరం (సిరప్ మందు) పిల్లలకు వేయమని భార్యకు చెప్పి భర్త బయటకు వెళ్లినట్లు బంధువులు తెలిపారు. భార్య సాయమ్మ ఐదుగురు పిల్లలకు జ్వరం మందు వేయడంతో చిన్నారులు అస్వస్థతకు గురై ఐదు సంవత్సరాల చిన్నారి ప్రియ మృతిచెందగా మిగతా నలుగురికి చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం అందించారు దీనిపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

**విచారణ చేపట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులు**

సిరప్ వికటించి చిన్నారి మృతి చెంది మరో నలుగురు చిన్నారులకు అస్వస్థత పై స్పందించిన వైద్య అధికారులు శనివారం అల్లాదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. డ్రగ్ కంట్రోల్ అధికారి చంద్రకళ ఆసుపత్రిలోని మందులను, రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలోని పలు కంపెనీల జ్వరం, సిరప్ లను ల్యాబ్ కు పంపిస్తున్నట్లు తెలిపి పూర్తి విచారణ చేస్తామని ఆమె తెలిపారు.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య,రమేష్

**మడికొండ, తెలంగాణ ముచ్చట్లు:**

మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు బెలిదే వెంకన్న కుమారుడు ధనుష్ కుమార్ - వైష్ణవి వివాహానంతర రిసెప్షన్ వేడుక శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య,వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు డీసీసీబీ డైరెక్టర్,ధర్మసాగర్ పిఎసిఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి,ఆకుల కుమార్,పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, బంధుమిత్రులు హాజరై వధూవరులను శుభాకాంక్షలతో అభినందించారు. ఈ సందర్భంగా వధూవరులకు మంచి భవిష్యత్ కోరుతూ పలువురు నేతలు ఆకాంక్షలు తెలిపారు.





# జుబేదా లాల్ మహ్మద్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ డిప్యూటీ సిఎం రాజయ్య

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

బక్రీద్ పర్వదినం సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీకో ఆప్షన్ సభ్యులు జుబేదాలాల్ మహ్మద్ నివాసానికి వెళ్లి, వారికి,వారి కుటుంబ సభ్యులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ ఆనందాలను లాల్ మహ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి పంచుకున్న రాజయ్య, మతసామరస్యానికి బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. మత, జాతి భేదమేమీ లేకుండా అందరూ కలిసి మెలసి ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు,ముస్లిం సోదరులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని పండుగ వేడుకలను జరుపుకున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి

◆ **హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ధారావత్ రవీందర్**

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మంజూరైన లబ్ధిదారులందరూ రెండు రోజులలోపు ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని హనుమకొండ జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ధారావత్ రవీందర్ తెలిపారు.ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన, జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున జూన్ 9వ తేదీలోపు మంజూరైన ఇంటి స్థలాల్లో ముగ్గులు వేసి నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ఒకేసారి సామూహికంగా నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఇది జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే చేపడుతున్న చర్యగా పేర్కొన్న రవీందర్, అందుకు సంబంధించి తహసీల్దారులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక అధికారులు పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ పథకం కింద మంజూరైన గృహాలను ప్రామాణిక ప్రమాణాలతో, వేగంగా పూర్తిచేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.





# రజిత నాగరాజు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

◆ **రాజయ్య -ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అవకతవకలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం**

స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:

స్టేషన్ ఘనపూర్ మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన రజిత–నాగరాజు కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరామర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో జరిగిన అన్యాయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, "తక్షణమే రీ సర్వే జరిపి అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలి. లేకపోతే మహాధర్నాకు సిద్ధంగా ఉన్నాం" అని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరులో జరిగిన అక్రమాలపై మాట్లాడిన ఆయన, "శివునిపల్లిలో అధికారుల సమక్షంలో తొలుత ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలో రాత్రికి రాత్రే మార్పులు జరిపి, కడియం శ్రీహరి అనుచరులు తమ వర్గానికి చెందిన పేర్లను చేర్చారు. దీనివల్ల అర్హులైన రజిత వంటి వారిని విస్మరించారు," అని విమర్శించారు.

రజిత – నాగరాజు నివాసాన్ని పరిశీలించిన డాక్టర్ రాజయ్య, "ఇక్కడ కనీస గోడలు కూడా లేవు. రేకులతో చుట్టముట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి శర్మకరం," అన్నారు. ఇటీవల రాష్ట్ర అవతరణ వేడుకల్లో కడియం శ్రీహరిని రజిత ఇల్లు కావాలంటూ వేడుకోవడంతో, ఆయన "ఏంటి తమాషా చేస్తున్నావా?" అంటూ తిట్టి, అక్కడే ఉన్న మహిళా పోలీసులతో ఆమెను నెట్టడంతో చేతికి గాయమైందని ఆయన వివరించారు.

ఈ ఘటనపై బాధ్యత వహించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన రాజయ్య, "శివునిపల్లిలో తక్షణమే రీ సర్వే జరిపి రజిత కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రీ సర్వే జరిపి అర్హులకు ఇండ్లు అందేలా చూడాలి. ఇది జరగకపోతే స్టేషన్ ఘనపూర్ కేంద్రంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడతాం," అన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాచర్ల గణేష్,మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్,నాయకులు మారపల్లి ప్రసాద్,గుండె మల్లేష్, నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్







# ఉర్సు దర్గా పీఠాధిపతి ఆతిథ్యాన్ని స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

- బక్రీద్ సందర్భంగా పీఠాధిపతి నివాసానికి కొండా

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు:**

పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి శనివారం ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పీఠాధిపతి ఉబేద్ బాబా, వారి తండ్రి నవీద్ బాబా సహా కుటుంబ సభ్యులతో కలిసి మృదుస్వభావంగా పండుగ పరస్పరానురాగం పంచుకున్నారు. ఈ సందర్భంగా బక్రీద్ ప్రత్యేక వంటకమైన షీర్ ఖుర్మా స్వీకరించిన కొండా మురళి, ముస్లిం సోదరులతో కలిసి సాంప్రదాయాలను గౌరవిస్తూ మతసామరస్యానికి పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. ఉత్సవ వాతావరణంలో ప్రేమ, ఐక్యత పండుగ సారాన్ని ఇస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నవీన్ రాజ్, పలువురు ప్రముఖులు, స్థానికులు కూడా పాల్గొని పండుగ వేడుకలకు ఆనందాన్ని జోడించారు.








# క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- గ్రామీణ యువత జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపు

**కేశంపేట,తెలంగాణ ముచ్చట్లు:**

పాపిరెడ్డిగూడ గ్రామంలో మైత్రి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించిన షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గ్రామీణ యువత క్రీడలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఏ ఆటలోనైనా గెలుపు -ఓటములు సహజం. కానీ చివరి వరకు పోరాడే క్రీడా స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో ఉండాలి. టీమ్ స్పిరిట్ ఉంటేనే నిజమైన విజయం సాధ్యమవుతుంది. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువు, క్రీడలపై దృష్టి పెట్టాలి. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరవచ్చు” అని తెలిపారు.
అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, శ్రీధర్ రెడ్డి, రమేష్, భాస్కర్, కరుణాకర్, నర్సింలు, అనుసూయ, సురేష్ రెడ్డి, గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండె పోటుతో టీడీపీ కార్యకర్త మృతి

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**



సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్త పాకలపాటి సీతారాములు (వయసు 48) శనివారం గుండె పోటుతో మృతి చెందారు.
గత కొద్దిరోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సీతారాములు స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
సీతారాములు గ్రామ రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించేవారని, పార్టీ బలోపేతానికి చివరి వరకు కృషి చేశారని స్థానిక నాయకులు పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యకర్తగా పాటు, భారతీయ జనతా పార్టీ కార్యకలాపాల్లోనూ కొన్ని సందర్భాల్లో సహకరించినట్టు గుర్తుచేశారు.
సీతారాములుకు పార్టీ నేతలు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణికి రక్తదానం చేసిన శివకుమార్

- తక్షణమే స్పందించిన ఆంజనేయ ట్రావెల్స్ యజమాని

**ఆసిఫాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



కెరామెరి మండలం ఝరి గ్రామానికి చెందిన సమ్రీన్ బీ అనే గర్భిణి మహిళ తీవ్ర రక్తహీనతతో బాధపడుతూ ఆసిఫాబాద్ ఉషా ఆసుపత్రిలో అత్యవసరంగా చికిత్స పొందుతోంది. వైద్యులు తక్షణమే ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకొనగా, ఆమెకు (ఓ పాజిటివ్) గ్రూపు రక్తం అవసరమైంది.
ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఆసిఫాబాద్ మండలం బూరుగూడకు చెందిన శ్రీ ఆంజనేయ టూర్స్ అండ్ ట్రావెల్స్ యజమాని, ప్రజా సేవలో కొనసాగుతున్న గాజుల శివకుమార్ వెంటనే స్పందించి, ఆసిఫాబాద్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. సమయాన్ని ఆసక్తిగా ఆసక్తిగా గమనించిన ప్రజలు శివకుమార్ కు అభినందనలు తెలియజేస్తున్నారు. “రక్తదానం చేద్దాం - ప్రాణదాతలవుదాం” అనే సందేశాన్ని మరోసారి అందరికీ గుర్తుచేస్తూ ఈ సంఘటన ఉదాహరణగా నిలుస్తోంది.

# బీజాపూర్ పోలీస్ కస్టడీలోని మావోయిస్టు నాయకుల్ని కోర్టులో హాజరు పర్చాలి

- మావోయిస్టు మరణాలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలి
- వామపక్ష పార్టీల డిమాండ్



చతీష్‌ఘడ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు అగ్రనాయకుల హత్యలు అత్యంత అమానుషంగా కొనసాగుతున్నాయి. బీజాపూర్ పోలీస్ కస్టడీలోని నాయకుల్ని ఒక్కొక్కర్ని కాల్చిచంపి, ఎన్‌కౌంటర్స్‌గా ప్రకటిస్తున్నారు. 2004 నాటి శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్‌తోపాటు, సురేష్ తదితర ఐదుగురి మరణం అనేక ప్రశ్నల్ని లేవనెత్తుతున్నది. అంతేగాకుండా పది, ఇరవై మంది నాయకులు ఇంకా వాళ్ళ కస్టడీలో ఉన్నట్లు, వారందరినీ కూడా ఇదే రీతిలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ మరణాలుగా ప్రకటించే అవకాశం కన్పడుతున్నది. ఈ నేపథ్యంలో బీజాపూర్ పోలీస్ కస్టడీలో ఉన్నవారందర్నీ వెంటనే కోర్టుకు అప్పగించాలని, సుధాకర్, సురేష్ తదితరుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపి వేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాం.
శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయమైన మఖ్దూం భవన్‌లో వామపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. ఈ సమావేశంలో పశ్య పద్మ (సిపిఐ) అధ్యక్షత వహించగా, సిపియం నుండి అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ నుండి వేములపల్లి వెంకట్రామయ్య, కె. గోవర్ధన్, యంసిపిఐ(యు) నుండి వనం సుధాకర్, ఎస్‌యుసిఐ (సి) నుండి తేజ, ఆర్ఎస్‌పి నుండి జానకి రాములు పాల్గొన్నారు. కూనంనేని సాంబశివారావు (సిపిఐ), జాన్ వెస్లీ (సిపిఎం). పి. సూర్యం (సిపిఐ (ఎం ఎల్ )న్యూడెమోక్రసీ), పోటు రంగారావు (సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ), గాదగోని రవి (ఎమ్‌సీపీ ఐయూ), ప్రసాదన్న (సిపిఐ ఎం ఎల్ ), సీహెచ్. మురహరి (ఎస్ సీఐ సీ), రమేష్‌రాజా (సిపిఐ ఎం ఎల్ ) లిబరేషన్, జానకి రాములు (ఆర్ఎస్‌పీ), బండా సురేందర్ రెడ్డి ( ఫార్వర్డ్ బ్లాక్ )

# మేడిగడ్డ నుంచి ఐదేళ్లలో ఎత్తిపోసింది 162 టీఎంసీలే

- కాళేశ్వరం–మేడిగడ్డ బ్యారేజీ నుంచి ఐదేళ్లలో ఎత్తిన 162 టీఎమ్‌సీ నీళ్లు
- 63 టీఎమ్‌సీ వరద సమయాల్లో సముద్రంలో రిలీజ్ – 99 టీఎమ్‌సీ వాడిన్నిఎలా వివరణ?
- మెడిగడ్డ పైకి నీటిపంపిణి – తిప్పిపోతల పథకం వెర్సెస్ గ్రావిటీ ప్రాజెక్టులు



**హైదరాబాద్( తెలంగాణ ముచ్చట్లు)**

‘కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీ నుంచి ఐదేళ్లలో ఎత్తిపోసిన నీళ్లు 162 టీఎంసీలు. వరదలు వచ్చిన సమయంలో వీటిలో సముద్రంలోకి వదిలింది 63 టీఎంసీలు. మిగిలిన 99 టీఎంసీలతో 22 లక్షల ఎకరాలకు నీళ్లు ఎట్లా ఇచ్చారో చెప్పాలి’ అని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారాస నేత హరీశ్‌రావును ప్రశ్నించారు. కాళేశ్వరంపై హరీశ్ అవాస్తవ ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. భారాస చేసిన ప్రచారానికి అంశాల వారీగా సమాధానం ఇస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు.
‘‘కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ గుండెకాయ అని చెప్పింది మీరే. ఆ బ్యారేజీ నుంచి ఎత్తిపోసిన నీటినే కాళేశ్వరం నీటిగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. 2019లో ఆ బ్యారేజీ నిర్మాణం పూర్తయితే.. అక్కడి నుంచి 201920లో 61 టీఎంసీలు, 202021లో 31.82, 202122లో 33, 202223లో 25.97, 202324లో 8.93 టీఎంసీలు కలిపి 162 టీఎంసీలు ఎత్తిపోశారు. వరదలతో దిగువకు వదిలిన 63 టీఎంసీలు పోనూ మిగులు నీటితో 22 లక్షల ఎకరాలకు ఎట్లా నీరిచ్చినట్లు? మరోవైపు 2022లో సిరిపురం (అన్నారం) పంప్‌హౌస్, కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ గోడ కూలి.. మోటార్లన్నీ దెబ్బతిన్నాయి. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగింది. మూడు బ్యారేజీలను నీళ్ల మళ్లింపునకు కాకుండా నిధుల మళ్లింపునకు నిర్మించారు. 1975లో రాతితో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ఇప్పటికీ చెక్కు చెదరలేదు.

**కాంగ్రెస్‌కు పేరు వస్తుందని..**

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని కడతామని మహారాష్ట్రతో ఒప్పందం చేసుకొని ఏనుగులతో ర్యాలీలు తీయలేదా? కాంగ్రెస్‌కు పేరు వస్తుందని, భారాసకు పైసలు రావనే దానిని నిర్మించలేదు. ఆ బ్యారేజీ నిర్మించి ఉంటే 100 కి.మీ. వరకు గ్రావిటీ ద్వారా నీళ్లు వచ్చేవి. అలాకాకుండా 100 కి.మీ. దిగువకు వెళ్లి మేడిగడ్డ నుంచి నీటిని పైకి ఎత్తిపోసి, వరదలు వస్తే మళ్లీ దిగువకు వదులుతున్నారు. ఇది ఎత్తిపోతలు కాదు. తిప్పిపోతల పథకం. తెలంగాణ ఏర్పడే నాటికి ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పనులు చేపట్టగా 2016 నాటికి రూ.11,679 కోట్లు వ్యయం చేశారు. అయినా ఆ ప్రాజెక్టును మార్చారు. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి ప్రధాన కారకులు కేసీఆర్, హరీశ్‌రావులే. 2018 వరకు నీటి పారుదలశాఖ మంత్రిగా ఉండి ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకు హరీశ్‌రావు ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాల్సింది పోయి ఎదురుదాడికి దిగుతున్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని ఏ రోజూ కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చెప్పలేదు. నీటిపారుదలపై మీరు చేసిన అప్పులకు ఏటా రూ.16 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోంది. కాళేశ్వరం పంపుహౌసులన్నీ నడిపిస్తే ఏటా రూ.10 వేల కోట్ల విద్యుత్తు బిల్లు వస్తుంది. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఉంటే రూ.వెయ్యి కోట్ల విద్యుత్తు బిల్లు వచ్చేది. మీ తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రంపై శాశ్వతంగా ఆర్థిక భారం పడింది’’ అని ఉత్తమ్ పేర్కొన్నారు.

# మ్యాచ్‌ఫిక్సింగ్ అంటూ రాహుల్ గాంధీ పోస్టు..

**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)**

మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు ఆ ఎన్నికలు ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. బిహార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందని విమర్శించారు. దీనిపై భాజపా కౌంటర్ ఇచ్చింది.
ఎన్నికల్లో అక్రమాలు ఎలా..? అంటూ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ‘‘ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు 2024లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు ఒక ఉదాహరణ. ఎన్నికల కమిషన్ నియామకం, నకిలీ ఓటర్ల నమోదు, పోలింగ్‌లో అవకతవకలు,



ఆధారాలను దాయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. భాజపా ఎందుకు అలా ప్రవర్తించిందో అర్థం చేసుకోవడం పెద్దకష్టం కాదు. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్ లాంటిది. మోసం చేసే పార్టీ ఆటలో గెలవొచ్చు. కానీ అలాంటి గెలుపు వ్యవస్థలను దెబ్బతీస్తుంది. ఎన్నికల ఫలితాలపై ప్రజల విశ్వాసాన్ని నాశనం చేస్తుంది. ప్రజలంతా ఆధారాలను గమనించి సమాధానాల కోసం డిమాండ్ చేయాలి. ఎందుకంటే మహారాష్ట్ర తర్వాత బిహార్ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత భాజపాకు ఓటమి భయం ఎక్కడుంటుందో అక్కడ ఇవే పునరావృతం అవుతాయి. మ్యాచ్‌ఫిక్సింగ్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విషం లాంటివి’’ అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.
ఇవే అంశాలను ఆయన ఓ జాతీయ మీడియా కాలమ్‌లో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈసీ చాలా సార్లు వివరంగా చెప్పినా.. రాహుల్ గాంధీ మళ్లీ దేశంలోని వ్యవస్థలను బూచిగా చూపే పనిలో ఉన్నారని మండిపడింది. మహారాష్ట్ర శాసనసభకు 288 సీట్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో భాజపా, శివసేన(శిందే), ఎన్‌సీపీ(అజిత్ పవార్) కూటమి 235 సీట్లు గెల్చుకుంది. ఒక్క కమలం పార్టీకే 132 స్థానాలు దక్కాయి. మరోవైపు ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

# బలవంతంగా రుద్దొద్దు..నేర్చుకుంటాం

**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)**



తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న క్రమంలో హిందీ భాష గురించి కమల్ హాసన్ వివరణ ఇచ్చారు. దక్షిణాదిపై హిందీ భాషను బలవంతంగా రుద్దడం అనే వివాదంపై కమల్ హాసన్ వైఖరి ఏమిటి? అన్న మీడియా ప్రశ్నకు ‘నేను పంజాబ్‌కు అండగా నిలుస్తా, కర్ణాటకకు మద్దతు ఇస్తా, ఆంధ్రాకు మద్దతు ఇస్తా’ అని ఆయన సమాధానం ఇచ్చారు. ‘భాషను బలవంతంగా రుద్దకండి.. మేము నేర్చుకుంటాం’ అని ఆయన స్పష్టం చేశారు. ‘ఎందుకంటే అంతిమంగా ఇది విద్య. మనం విద్య నేర్చుకోవడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకోవాలి. ఆ మార్గంలో అడ్డంకులు సృష్టించొద్దు’ అని ఆయన అన్నారు. ఒక నిర్దిష్ట భాషను బలవంతంగా రుద్దడం వల్ల అభ్యాసన ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇక పోస్టల్ పిన్‌కోడ్‌కు స్వస్తి..




డిజిపిన్ అనేది ఐఐటీ హైదరాబాద్, ఇస్రో సహకారంతో పోస్టల్ శాఖ అభివృద్ధి చేసిన కొత్త డిజిటల్ అడ్రస్ సిస్టమ్. ఈ వ్యవస్థ ఉద్దేశ్యం భారతదేశంలోని ఏ ప్రదేశానికైనా లేదా ప్రదేశానికైనా ఖచ్చితమైన డిజిటల్ గుర్తింపు లేదా ఐడిని అందించడం. పోస్టల్ పిన్‌కోడ్‌లో కీలక మార్పులు జరగనుంది. మీరు చివర్లో మీ చిరునామా ఇచ్చినప్పుడు పిన్ కోడ్ వల్ల ఉపయోగం ఏమిటో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? పిన్ కోడ్ అనేది భారతదేశంలోని ఒక ప్రాంతాన్ని లేదా ప్రదేశాన్ని గుర్తించడానికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన 6 అంకెల సంఖ్య. ఇది ఏ కొరియర్ వ్యక్తిని మీ చిరునామాకు ఖచ్చితంగా మళ్లించదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, భారత పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక కొత్త అడ్రస్సింగ్ సిస్టమ్‌ను విడుదల చేసింది. దీనికి డిజిపిన్ అని పేరు పెట్టారు. దీని ఉద్దేశ్యం దేశంలోని ఏ మూల ఖచ్చితమైన చిరునామాను డిజిటల్ రూపంలో అందించడం. ఈ కొత్త వ్యవస్థ అంటే ఏమిటి? డిజిపిన్ అనేది ఐఐటీ హైదరాబాద్, ఇస్రో సహకారంతో పోస్టల్ శాఖ అభివృద్ధి చేసిన కొత్త డిజిటల్ అడ్రస్ సిస్టమ్. ఈ వ్యవస్థ ఉద్దేశ్యం భారతదేశంలోని ఏ ప్రదేశానికైనా లేదా ప్రదేశానికైనా ఖచ్చితమైన డిజిటల్ గుర్తింపు లేదా ఐడిని అందించడం. ఇది భారత దేశాన్ని సుమారు 4ఎ ఇ 4ఎ గ్రిడ్స్ (ఇండ్లు, కార్యాలయాలు, సంస్థలు మొదలైనవాటి)గా విభజిస్తుంది. ఈ ఐడి 10అక్షరాల కోడ్ డిజిపిన్ (ఐIGIలా Iచీ ఐఅస్త్రత్a్రీ వాశీర్a్రీ Iఅసవఇ చీబఎపవతీ) అంటారు. ఈ కోడ్ ఏదైనా ప్రదేశం అక్షాంశం, రేఖాంశంపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థ సహాయంతో ఏదైనా వీధి లేదా గ్రామం ఖచ్చితమైన చిరునామాను సులభంగా కనుగొనవచ్చు. ఇప్పుడు ఏ కొరియర్ లేదా ఏ వ్యక్తికి మీ చిరునామాను చేరుకోవడంలో ఎటువంటి సమస్య ఉండదు. డిజిపిన్, పిన్‌కోడ్ రెండూ చిరునామాలను గుర్తించడానికి ఉపయోగించినప్పటికీ, వాటి పని విధానం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. పిన్‌కోడ్ అనేది చాలా పెద్ద ప్రాంతాన్ని గుర్తించే 6 అంకెల సంఖ్య. డిజిపిన్ అనేది భారతదేశంలోని ఏదైనా ప్రదేశం ఖచ్చితమైన స్థానాన్ని గుర్తించడంలో సహాయపడే డిజిటల్ స్థాన వ్యవస్థ. పిన్‌కోడ్ 6 అంకెలతో కూడినట్లే, డిజిపిన్ అనేది 10 అక్షరాల ప్రత్యేక కోడ్. ఈ వ్యవస్థలో మొత్తం దేశం 4ఐ4 మీటర్ల గ్రిడ్‌గా విభజించారు. దీని తరువాత, ప్రతి భాగానికి 10 అక్షరాల ప్రత్యేక కోడ్ అందిస్తారు. మొత్తంమీద డిజిపిన్ మరింత ఖచ్చితమైన స్థానాన్ని ఇస్తుంది. అయితే పిన్‌కోడ్ ప్రాంతం గురించి సమాచారాన్ని మాత్రమే ఇస్తుంది.

# గ్రామ స్థాయికి క్రెడిట్ అవగాహన.. సిబిల్, సా-ధన్ కొత్త కార్యక్రమం!



దేశంలో ఆర్థిక అవగాహనను పెంచేందుకు, బాధ్యతాయుత రుణ విధానాలను ప్రోత్సహించేందుకు ఒక ముఖ్య అడుగు పడిరది. క్రెడిట్ సమాచారంలో అగ్రగామి సంస్థ ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సూక్ష్మ రుణ సంస్థల అపెక్స్ బాడీ సాధన్ కలిసి పని చేయనున్నాయి. దేశవ్యాప్తంగా రుణాలపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా, రుణదాతలు, చిన్న మొత్తంలో అప్పు తీసుకునేవారికి ఆర్థిక విషయాలపై పట్టు పెంచడమే ఈ భాగస్వామ్యం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని ఆయా సంస్థలు ప్రకటించాయి. ఈ సహకారం వల్ల చిన్న రుణ సంస్థల రుణ మూల్యాంకనం, పర్యవేక్షణ సామర్థ్యాలు మెరుగుపడతాయి. డేటా ఆధారిత విశ్లేషణలు, అధునాతన సాధనాలు, ప్రత్యేక శిక్షణల ద్వారా చిన్న రుణ సంస్థలను బలోపేతం చేయనున్నారు. దీనివల్ల ఆర్థిక సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. బాధ్యతాయుతమైన రుణ పంపిణీకి ప్రోత్సాహం లభిస్తుంది. ఈ అవగాహన కార్యక్రమం దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరేలా పలు భాషల్లో డిజిటల్ సమాచారం రూపొందించారు. కమ్యూనిటీ ఆధారిత విధానాన్ని అనుసరించి, చిన్న రుణ సంస్థలు తమ ఖాతాదారులకు రుణాలపై సరైన అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. తద్వారా, బాధ్యతాయుతమైన క్రెడిట్ అలవాట్లు పెంపొందుతాయి. ఆర్థిక సేవలు తగినంతగా అందుబాటులో లేని ప్రాంతాల్లో ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఢల్లీకేంద్రంగా పనిచేస్తున్న సాధన్ సంస్థకు 230కి పైగా సూక్ష్మ రుణ సంస్థలు, బ్యాంకులు సభ్యులుగా ఉన్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సాధన్ కలిసి ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాయి. క్రెడిట్ స్కోర్ ప్రాముఖ్యత, డేటా వినియోగం, పటిష్టమైన రుణ వ్యవస్థ నిర్మాణం వంటి అంశాలపై చిన్న రుణ సంస్థలకు, వారి బృందాలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా మాడ్యూల్స్ రూపొందిస్తాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ భవేష్ జైన్ మాట్లాడుతూ.. ''రుణాలపై అవగాహన కేవలం అప్పు తీసుకోవడానికి మాత్రమే కాదు. ఆర్థిక ప్రపంచంలో నమ్మకాన్ని, విశ్వసనీయతను పెంచుకోవడానికి ఇది కీలకం. డిసెంబర్ 2024 నాటికి 13 కోట్ల మంది తమ సిబిల్ రిపోర్ట్, స్కోర్‌ను పరిశీలించారు. ఇది క్రెడిట్ గురించి ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనం. ఈ భాగస్వామ్యం ద్వారా, చిన్న రుణ సంస్థలు, వారి ఖాతాదారులకు ఆర్థికంగా మరింత మెరుగైన భవిష్యత్తును అందించాలని మేము ఆశిస్తున్నాం'' అని తెలిపారు.

# జీఎస్టీ శ్లాబ్ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం




మార్కెటింగ్ రంగంలోని వారికి జీఎస్టీ అంటే పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. ముఖ్యంగా వివిధ రకాల పన్నులన్నింటినీ ఒకే రకమైన పన్ను విధానంలోకి తీసుకొచ్చి వేసే పన్నును జీఎస్టీ అంటారు. దేశంలో విక్రయించే వివిధ వస్తువుల వివిధ శాతాలతో జీఎస్టీ విధిస్తారు. అయితే 12 శాతం శ్లాబ్ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జీఎస్టీలో 12 శాతం పన్ను స్లాబ్‌ను తొలగించే ప్రణాళికను జీఎస్టీ కౌన్సిల్ త్వరలో పరిశీలించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ శ్లాబ్ నాలుగు నుంచి మూడుకు తగ్గించవచ్చని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు జూన్‌చివరిలో లేదా జులైలో కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో 12 శాతం శ్లాబ్ గురించి జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన రాష్ట్ర ఆర్థిక మంత్రులతో కూడిన కౌన్సిల్ ఆదాయ తటస్థతను కొనసాగిస్తూ 12శాతం స్లాబ్‌ను తొలగించడం ద్వారా రేట్లను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జీఎస్టీ విధానంలో ప్రధానంగా నాలుగు పన్ను శ్లాబులు ఉన్నాయి, 5%, 12%, 18%, 28%. అయితే దీంతో పాటు ఆభరణాలపై కూడా 3 శాతం ఉంది. చాలా మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, నిపుణులు, జీఓఎం ప్రతినిధులు 12 శాతం GST స్లాబ్‌ను తొలగించే ప్రణాళికను సమర్థించారు. ఈ శ్లాబ్ కిందకు వచ్చే వస్తువులను 5 శాతం లేదా 18 శాతానికి మార్చవచ్చని నివేదికల్లో స్పష్టం అవుతుంది. ముఖ్యంగా రోజువారీగా ఉపయోగించే సామూహిక వినియోగ వస్తువులను 5 శాతం పన్ను స్లాబ్‌కి మార్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# వడ్డీ రేట్లు అర శాతం తగ్గింపు

**రిజర్వ్ బ్యాంక్ వరుసగా మూడోసారి వడ్డీ రేట్లకు కోత విధించింది. మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్షలో కీలక రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా 5.50 శాతానికి చేర్చింది. ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్లు చొప్పున వడ్డీ రేట్లను తగ్గించింది. మొత్తంగా రుణాలపై వడ్డీ ఒక్క శాతం మేర కోత విధించడంతో పాత, కొత్త గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణగ్రహీతలపై వడ్డీ భారం కొంత తగ్గనుంది. ఆర్‌బిఐ ఎంపీసీ భేటీ తర్వాత శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణం స్థిరంగా తగ్గుతోందన్నారు. ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జీడీపీ 6.5 శాతం పెరగొచ్చన్నారు. పెట్టుబడిదారులకు అపార అవకాశాలు కల్పిస్తోందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ అంచనాలను 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గిస్తున్నామన్నారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్టు మల్హోత్రా తెలిపారు.**



**మరోవైపు బ్యాంక్‌ల వద్ద నగదు లభ్యతను పెంచడానికి నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ను 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో సీఆర్‌ఆర్ 4 శాతం నుంచి 3 శాతనికి తగ్గనుంది. దీన్ని సెప్టెంబర్ నుంచి 25 బేసిస్ పాయింట్ల చొప్పున నాలుగు విడతలుగా అమలు చేయనున్నట్టు తెలిపింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలోకి దాదాపు రూ. 2.5 లక్షల కోట్లు నగదు లభ్యతను పెంచనుందని అంచనా వేసింది. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్టవుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ.9.5 లక్షల కోట్లు ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చామని మల్హోత్రా తెలిపారు. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయన్నారు. దీంతో మరో 11 నెలల వరకు దిగుమతులకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ దఫా వడ్డీ రేట్లలో పావు శాతం తగ్గింపు ఉండొచ్చని నిపుణులు అంచనా వేయగా.. ఎస్‌బీఐ మాత్రం అర శాతం కోత ఉండొచ్చని ముందస్తు భావించడం విశేషం.**

# తగ్గనున్న ఈఎంఐల భారం..

ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ రెపో ఆధారిత వడ్డీ రేట్లు (ఆర్‌బీఎల్‌ఆర్) 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ వెల్లడించింది.

ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ రెపో ఆధారిత వడ్డీ రేట్లు (ఆర్‌బీఎల్‌ఆర్) 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ వెల్లడించింది.




తాజా రేట్ల తగ్గింపుతో గృహ రుణాలు 7.45 శాతం నుంచి ప్రారంభం కానుండగా వాహన రుణాలు 7.8 శాతం నుంచి మొదలవుతాయని పీఎన్‌బీ తెలిపింది. కాగా బీఓఐ కూడా తన ఆర్‌బీఎల్‌ఆర్‌ను 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించినట్లు వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఒక శాతం తగ్గించింది. ఇందులో అర శాతాన్ని ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ నెలల్లో, మిగతా అర శాతాన్ని శుక్రవారం తగ్గించింది. దీంతో రెపో ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి. అయితే ఈ వడ్డీ రేట్ల కోతతో ఎవరికి ఎంత భారం తగ్గుతుందనేది ఆయా వ్యక్తుల రుణ కాలపరిమితి, ఈఎంఐలపై ఆధారపడి ఉంటుంది. ఒకే కాలపరిమితితో కేవలం ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే ఒక రకంగా, అదే ఈఎంఐతో కాలపరిమితి మాత్రమే తగ్గించుకుంటే వడ్డీ భారం తగ్గుతుంది. ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే: 20 ఏళ్ల కాలపరిమితితో ఒక వ్యక్తి 9.5 శాతం వడ్డీతో గృహ రుణం తీసుకుంటే, ఇప్పుడు అతను చెల్లించే వడ్డీ రేటు 8.5 శాతం. అదే కాలపరిమితితో ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే అతడికి నెలకు ఆదా అయ్యే ఈఎంఐ రూ.1,929. అంటే 20ఏళ్ల కాలంలో అతడికి ఆదా అయ్యే వడ్డీ రూ.4,63 లక్షలు.



# వియత్నాం- భారత్ మధ్యమంచి సంబంధాలు

వియత్నాం భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ బృందం పేర్కొంది. ఆ సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సి ఉందని తెలిపింది. శుక్రవారం నాడిక్కడ సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయాన్ని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిటికల్ బ్యూరో సభ్యులు న్గుయెన్ ట్రోంగ్ న్గియా, కేంద్ర కమిటీ సభ్యులు ఎన్గో డాంగ్ హై, న్గుయెన్ థాన్ న్హ, లే హై బిన్, బ్రిగేడియర్ జనరల్ ఫామ్ ట్రోంగ్ ఫువాంగ్, కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ న్గుయెన్ వాన్ డక్, సెంట్రల్ కమిషన్ ఫర్ పబ్లిసిటీ డోఫువాంగ్ థావో, విదేశాంగ మంత్రిత్వ శాఖ సీనియర్ స్పెషలిస్ట్ న్గుయెన్ ట్రోంగ్ కీన్, విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రోటోకాల్ అధికారి ఫామ్ జువాన్ నామ్, విదేశాంగ మంత్రిత్వ శాఖ సభ్యులు లూరు అన్హ తువాన్, లెఫ్టినెంట్ కల్నల్ హౌంగ్ ట్రోంగ్ కీన్‌లతో కూడిన బృందం సందర్శించింది. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్ కుమార్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్, రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్‌లను కలిశారు. ఈ సందర్భంగా రెండు పార్టీల నేతల మధ్య చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాలను, రెండు దేశాల ప్రజల మధ్యకు తీసుకెళ్లాల కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రజల మధ్య సంబంధాలను బలపడేలా చూడాలని పేర్కొన్నారు. సీపీఐ(ఎం), వియత్నాం కమ్యూనిస్టు పార్టీ మధ్య ఎప్పటి నుంచో దగ్గర సంబంధాలు ఉన్నాయని, వియత్నాం విముక్తి పోరాట సమయంలో సీపీఐ(ఎం) అందించిన మద్దతును, ప్రజలను సమీకరించడంలో సీపీఐ(ఎం) చొరవను తాము మర్చిపోమని వియత్నాం బృందం పేర్కొంది. వియత్నాం 8 శాతం జీడీపీతో అభివృద్ధి పదంలో నడుస్తోందని, పేదరికం నానాటికీ తగ్గుతోందని తెలిపింది. జనవరిలో తమ పార్టీ 14వ మహాసభ జరగనుందని, ఈ మహాసభలో వియత్నాం అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొంది. ఆ మహాసభ నిర్ణయాలను సీపీఐ(ఎం)తో కూడా పంచుకుంటామని తెలిపింది. కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వ పరిపాలన, అభివృద్ధి చర్యలు బాగున్నాయని విన్నామని వియత్నాం బృందం తెలిపింది.

# 2026 ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు

బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ తాత్కాలిక నాయకుడు ముహమ్మద్ యూనస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ఆయన శుక్రవారం ప్రకటించారు. గత సంవత్సరం ప్రజా తిరుగుబాటు కారణంగా ప్రభుత్వం కూలిపోయింది. అంతేకాదు, షేక్ హసీనా దేశం విడిచి పారిపోయింది. హసీనా లేకుండానే బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవే. ముహమ్మద్ యూనస్ ఎన్నికల గురించి మాట్లాడుతూ.. "2026 ఏప్రిల్ మొదటి అర్థభాగంలో ఏ రోజైనా ఎన్నికలు జరుగుతాయి... నేను దేశ పౌరులకు తెలియజేస్తున్నాను" అని అన్నారు. విస్తృత నిరసనలు, రాజకీయ తిరుగుబాటు ఆగస్టులో షేక్ హసీనా రాజీనామాకు దారితీసింది. ఇదిలావుంటే.. డిసెంబర్ 2025 నాటికి జాతీయ ఎన్నికలు నిర్వహించాలని, "వివాదాస్పద సలహాదారులను" తొలగించడం ద్వారా తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని గత నెలలో మాజీ ప్రధాన మంత్రి ఖలీదా జియా తెలిపింది.





## ఢిల్లీ జామా మసీద్‌కు పోటెత్తిన ముస్లిం సోదరులు

న్యూఢిల్లీ: ఇవాళ ప్రవిత్రమైన బక్రీద్ మాసాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న మసీదులకు ముస్లిం సోదరులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే పవిత్ర ప్రార్థనలు చేయడానికి మసీదుల ముందు బారులు తీరారు. దేశరాజధాని ఢిల్లీలోని జామా మసీదుకు ముస్లిం సోదరులతో కిక్కిరిసిపోయింది. పవిత్ర ప్రార్థనలకు కోసం కుటుంబసభ్యులతో కలిసి మైనార్టీలు మసీదులకు కదలివచ్చారు. దీంతో ఆ మసీదు ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. పరస్పరం పండగ శుభాకాంక్షలు తెలుపుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముస్లిం క్యాలెండర్ ప్రకారం.. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే అతి పవిత్రమైన పండుగ బక్రీద్. మరోవైపు రద్దీ దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా కల్పించారు. ట్రాఫిక్ జాం కాకుండా.. మసీదుకు వచ్చే మార్గాల్లో పలు ఆంక్షలు విధించారు. వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. సీసీ కెమరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచారు. మసీదుకు వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం-08- జూన్ 2025


# ఉదయాన్నే ఖాళీ కడుపుతో తమలపాకులు తింటే ఏమౌతుందో తెలిస్తే



తమలపాకు.. ఇది ఆకుపచ్చ రంగులో ఎంతో అందంగా మెరుస్తూ కనిపిస్తుంది. ఇలాంటి తమలపాకుని పూజాది శుభకార్యాలు మొదలుకుని చాలా రకాలుగా వాడతారు. ఆయుర్వేదంలో కూడా తమలపాకు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తమలపాకులో చాలా ఆరోగ్య ప్రయోజనాలు దాగివున్నాయని చెబుతున్నారు. తాజా తమలపాకులో కాల్షియం, విటమిన్ సి, రైబోఫ్లేవిన్, కెరోటిన్, నియాసిన్, క్లోరోఫిల్, యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. తమలపాకుని సరిగ్గా తింటే చాలా ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ లభిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపున తమలపాకు తింటే జీర్ణవ్యవస్థ బలపడుతుంది. తేపులు, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దగ్గు, జలుబుకి కూడా తమలపాకు మంచి మందులా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తమలపాకు కషాయం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. తమలపాకులో యాంటీసెప్టిక్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణనిస్తాయి. తిన్న ఆహారం జీర్ణం కావడానికి సహాయపడుతుంది. పాన్ తింటే సున్నం బదులు గుల్కంద్, సోంపు, డ్రై ఫ్రూట్స్ వాడితే మంచిది. సున్నం ఆరోగ్యానికి హానికరం. భోజనం చేసిన తరువాత రోజూ కొన్ని తమలపాకులు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రక్తంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయి. తమలపాకుల కషాయం తాగడం వల్ల శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావం తగ్గుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరం. నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. చిగుళ్ల నుంచి వచ్చే బ్లీడిరగ్ తగ్గుతుంది. చర్మంపై ఉండే అలర్జీ, దురద వంటి సమస్యలు దూరమౌతాయి. తమలపాకులు తింటే ఆరోగ్యపరమైన సమస్యలు తొలగిపోతాయి. ఓ గిన్నె నీటిలో తమలపాకులు వేసి బాగా మరగబెట్టాలి. ఆ తరువాత ఈ నీటిని రోజూ తాగితే వివిధ రకాల అనారోగ్య సమస్యలు దూరమౌతాయి. వైద్య నిపుణుల ప్రకారం, రోజుకి రెండు, మూడు తమలపాకుల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే వడలిన తమలపాకులో బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఇవి జీర్ణవ్యవస్థ మీద ప్రభావం చూపి, ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. అందుకే పాత తమలపాకు తినకూడదు. ఇది శరీరానికి హానికరం అంటున్నారు నిపుణులు.



# వారంలో 3 సార్లు తింటే ముసలోళ్లు అయ్యే ఛాన్సే లేదంట..!


ఈ ఆరోగ్యకరమైన మీల్ మేకర్‌ను సోయాతో తయారు చేస్తారు. మీల్ మేకర్‌లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొవ్వు ఉండదు. ప్రొటీన్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, సెలీనియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వెజిటేరియన్ వాళ్లకు మాంసానికి ప్రత్యామ్నాయంగా దీనిని పిలుస్తారు. మీల్ మేకర్‌ను సోయా చంక్స్ అని కూడా పిలుస్తుంటారు. ఈ ఆరోగ్యకరమైన మీల్ మేకర్‌ను సోయాతో తయారు చేస్తారు. మీల్ మేకర్‌లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొవ్వు ఉండదు. ప్రొటీన్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, సెలీనియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మీల్ మేకర్‌ను తరచుగా మన డైట్‌లో చేర్చుకుంటే.. లెక్కలేనన్నీ ఆరోగ్య లాభాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు.? ప్రొటీన్ .. అత్యధికంగా ఇచ్చే ఆహారాల్లో సోయా చంక్స్ ఒకటి. వెజిటేరియన్ మటన్ గా పిలిచే దీని వల్ల మసిల్స్ పెరిగేందుకు సహాయపడుతుంది. తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రొటీన్ అందిస్తుంది. కాల్షియం, ఐరన్ అధికంగా ఉండడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా ఇది.. డైబెటిక్ ఫ్రెండ్లీ ఫుడ్ అంటున్నారు నిపుణులు. మీర ముఖ్యంగా సోయా ఫుడ్స్‌తో అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. శరీరంలో రక్త ప్రసరణను నిర్వహించడంతో పాటు వివిధ సీజనల్ సమస్యలను దూరం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మీల్ మేకర్ తినటం వల్ల మహిళల్లో ఎముకలకు బలాన్నిస్తుంది. ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది. ఈ పోషకమైన మీల్ మేకర్ అన్ని వయసుల వారికి సమానంగా ప్రయోజనాలను అందిస్తుంది. వీటిలో చికెన్, మటన్, గుడ్లు కంటే ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది. వెజిటేరియన్స్ వీటిని మాంసానికి ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ప్రొటీన్ లోపంతో బాధపడేవారు.. మీల్ మేకర్ తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.? రోజుకి ఒక కప్పు సోయా చంక్స్ ని ఉడికించి కూర లేదా సలాడ్ రూపంలో తినాలి. ఎక్కువగా తినకుండా పరిమితంగా తీసుకోవాలి.



# గృహ ప్రవేశం రోజు అస్సలే ఈ తప్పులు చేయకూడదంట..

వ్యక్తులపై, కుటుంబంపై వాస్తు అనేది చాలా ఎఫెక్ట్ చూపిస్తుంటుంది. అందుకే వాస్తు బాగుండేలా చూసుకోవాలని చెబుతుంటారు. లేకపోతే చాలా కష్టాలు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాస్తు శాస్త్ర నియమాలు సరిగ్గా పాటిస్తే మంచి ఫలితాలు పొందడమే కాకుండా, చాలా శుభప్రదంగా కూడా ఉంటుంది. కాబట్టి పండితులు తప్పకుండా వాస్తు నియమాలు పాటించాలని చెబుతుంటారు. ముఖ్యంగా కొత్తగా ఇల్లు నిర్మించుకునే సమయంలో లేదా, కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేయబోతున్న సమయంలో చాలా జాగ్రత్తగా వాస్తు నియమాలు పాటించాలంట. లేకపోతే మీరు చేసే ఈ చిన్న తప్పులే భవిష్యత్తులో మీ ఇంటి ఆనందాన్ని, శ్రేయస్సును దూరం చేసే అవకాశం ఉండటమే కాకుండా, అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంట. గృహ ప్రవేశం చేస్తున్న వారు వాస్తు శాస్త్రం ప్రకారం ఆ రోజు నీలి రంగు దుస్తులు లేదా నలుపు రంగు దుస్తులను అస్సలే ధరించకూడదంట. వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం రోజు ఈ రంగు దుస్తులు ధరించడం శుభ ప్రదం కాదు అంటున్నారు పండితులు. అదే విధంగా నూతన గృహ ప్రవేశం రోజున మరో తప్పు కూడా అస్సలే చేయకూడదంట. మీరు వాస్తు శాస్త్రాన్ని నమ్మినట్లు అయితే ఈ రోజున అస్సలే కుటుంబ సభ్యులు ఎవరూ కూడా ఖాళీ చేతులతో ఇంట్లోకి ప్రవేశించకూడదంట. కుటుంబ సభ్యులందరి చేతుల్లో బియ్యం, పండ్లు, పూల వంటివి ఉండాలంట. ఇది చాలా మంచిఫలాలితాలను ఇస్తుందంట. అలాగే వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం చేసేటప్పుడు తప్పకుండా కుడి పాదాన్నే ముందు పెట్టాలంట. ఎట్టి పరిస్థితుల్లో ఎడమ కాలు పెట్టి గృహ ప్రవేశం చేయకూడదంట. కుడి పాదం పెట్టి కొత్త ఇంట్లోకి అడుగు పెట్టడం వలన అనేక శుభ ఫలితాలు కలుగుతాయంట. అలాగే గృహ ప్రవేశం చేసే రోజు గోమాతను ఇంటిలోకి ముందుగా ప్రవేశ పెట్టడం వలన అన్ని విధాలుగా కలిసి వస్తుందంట. అంతే కాకుండా ఈ రోజు మీ ఇంటి ఆడపిల్లకు బట్టలు పెట్టి, ఆమెకు బియ్యం పోయడం పూజించడం కూడా చాలా శుభ ప్రదం అంటున్నారు పండితులు.

# మటన్‌తో చేసుకోవాల్సిన ఐదు రుచిగల వంటకాలు



బక్రీద్ పండుగ వచ్చేసింది. జూన్ 7వ తేదీన ముస్లిమ్స్ అందరూ బక్రీద్ పండుగను జరుపుకుంటారు. అయితే ఈ ఫెస్టివల్‌కు అనేక రకాల వంటకాలు చేస్తుంటారు. కాగా, బక్రీద్ స్పెషల్ చాలా మందికి ఇష్టమైన మటన్‌తో ఈ ఐదురకాల వంటలు చేస్తే రుచి అదిరిపోవడమే కాకుండా ఈ పండుగ ఎప్పుడూ గుర్తుండిపోతుందంట. ఈ సారి బక్రీద్ పండగకు చాలా స్పెషల్ గా పార్సీ మటన్ కీమా కట్లెట్ చేస్తే విందు అదిరిపోతుందంట. దీని కోసం మటన్, కీమా, బంగాళదుంపలు, పార్సీ మసాలాదినుసులు తీసుకోవాలంట. తర్వాత మాంసం, ఉల్లిపాయలు, మిరపకాయాలు రెండు, సుంగంధ ద్రవ్యాలను వేయించుకోవాలంట. తర్వాత వీటికి బంగాళదుంపలు కలిపి టిక్కీ తయారు చేయాలంట. ఆ తర్వాత ఎగ్ వైట్ లో బ్రెడ్ ముక్కలను ముంచి డీప్ ఫ్రై చేసుకోవాలి. తర్వాత మటన్ టిక్కీని బ్రెడ్ ముక్కలతో కలిపి తింటే రుచి అదిరిపోతుందంట. కొబ్బరి నూనెలో వేయించిన మటన్, కరివేపాకు, సుగంధ ద్రవ్యాలతో తయారు చేసే ఈ కేరళ స్టైల్ మటన్ కర్రీ టేస్ట్ అదిరిపోతుందంట. దీని కోసం ఉల్లిపాయ, అల్లం, వెల్లుల్లి పేస్ట్, మసాలా దినుసులు, వేయించి ఉడికించిన మటన్ తో కలిపి, వీటన్నింటిని ఒక బౌల్ లో ఉడికించాలంట. తర్వాత మసాలా , కొత్తిమీర వేస్తే కేరళ స్టైల్ మటన్ వర్టియత్ రెడీ. ఎర్రపండు మిర్చి, వెనిగర్ తో తయారు చేసే గోవా స్టైల్ మటన్ వంటకం తింటే జీవితంలో మర్చిపోలేరంట. దీని కోసం ఎర్ర మిరపకాయలను, వెల్లుల్లి, సుగంధ ద్రవ్యాలు, వెనిగర్ పేస్ట్ లా కలుపుకోవాలంట. తర్వాత మటన్ ను మ్యారినేట్ చేసి ఉల్లిపాయలతో వేయించి, గ్రేవీలా చేసుకొని, తక్కువ మంట మీద ఉడికించాలి. కోరంగట్టు మటన్ వంటకం నెయ్యితో తయారు చేస్తారు. దేశీ నెయ్యి, పొడి సుగంధ ద్రవ్యాలు, చింతపండు కలిపి చేసే ఈ మటన్ వంటకం బ్రకీద్ విందులో స్పెషల్ గా నిలుస్తుంది. అంతే కాకుండా దీని రుచి అద్భుతంగా ఉంటుందంట. దీని కోసం కారం, కొత్తిమీర, జీలకర్ర, వెల్లుల్లి పేస్ట్ లా తయారు చేసుకోండి. తర్వాత కరివేపాకు, ఈ పేస్ట్ ని నెయ్యిలో వేయించాలి. ఉడికించిన మటన్, చింతపండు వేసి, మటన్ రంగు మారి నెయ్యి మిగిలే వరకు ఉడికించాలి. పైన కొంచెం నెయ్యి వేస్తే మీ కొరంగట్టు మటన్ రెడీ. లక్నో వీధుల నుండి వచ్చే ఈ ప్రత్యేకమైన నవాబీ వంటకం లక్నోవి మటన్ చాప్. గ్రేవీ, మటన్ కలయికతో ఉంటుంది, దీని టేస్ట్ వావ్ అనిపిస్తుందంట. అంతలా బాగుంటుంది. అయితే దీని కోసం మటన్ చాప్ ని పెరుగు, సుగంధ ద్రవ్యాలు, జీడిపప్పు పేస్ట్, నిమ్మరసంలో 4 గంటలు మ్యారినేట్ చేయండి. తరువాత నెయ్యిలో మెత్తగా, కొద్దిగా క్రిస్పీగా అయ్యే వరకు నెమ్మదిగా ఉడికించాలి. దానిపై కొత్తిమీర, ఉల్లిపాయలు వేయండి. అంతే, మీ లక్నోవి మటన్ చాప్ రాయల్ స్టైల్ లో రెడీ అయిపోతుంది.

# పుదీనా మజాకా..! అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు

వంటల్లో పుదీనా వేస్తే రుచి మారిపోతుంది. ఎందుకంటే దీని ఫ్లేవర్ అలా ఉంటుంది. పుదీనా ఆకుల్లోని విటమిన్ సి, రోగనిరోధక శక్తిని పెంచే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పుదీనాలో ఐరన్, మాంగనీస్, ఫోలేట్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీవక్రియ విధులు, కణాల పెరుగుదలకు తోడ్పడతాయి. పుదీనా ఆకులు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయి. పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కాపాడుతాయి. పుదీనాలో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దాంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ముఖ్యంగా నాన్ వెజ్ వంటకాలు బిర్యానీ, మటన్ ,చికెన్ వండేటప్పుడు పుదీనా ఆకులు వేస్తే అద్భుతమైన రుచి కలిగి ఉంటాయి. వర్షకాలం వచ్చిందంటే చాలు జలుబు, ముక్కుదిబ్బడ వంటి సమస్య ఎదురవుతుంటాయి.. ఈ క్రమంలో పుదీనా ఆకుల వాసన పీల్చితే ఉపశమనం లభిస్తుంది. ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉండటం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. పేలు , చుండ్రు సమస్యలను తొలగిస్తాయి. వంటల్లో పుదీనా వేస్తే రుచి మారిపోతుంది. ఎందుకంటే దీని ఫ్లేవర్ అలా ఉంటుంది. పుదీనా ఆకుల్లోని విటమిన్ సి, రోగనిరోధక శక్తిని పెంచే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పుదీనాలో ఐరన్, మాంగనీస్, ఫోలేట్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీవక్రియ విధులు, కణాల పెరుగుదలకు తోడ్పడతాయి. ప్రతి రోజూ ఉదయం పుదీనా ఆకులు, పుదీనా టీ తాగితే కడుపు ఉబ్బరం, గ్యాస్, వికారం సమస్యలు దూరం అవుతాయి. పుదీనా కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలకు తక్షణ ఉపశమనం ఇస్తుంది. పుదీనా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మాన్ని సంరక్షిస్తాయి. పుదీనాలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. పుదీనా చర్మానికి తాజాదనం అందిస్తాయి, రియాక్టివేట్ చేస్తాయి.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# టీం ఇండియాకు సవాల్ వంటిదే..




ఇంగ్లండ్ గడ్డపై భారత్ ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఆడనున్న సంగతి తెలిసిందే. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య సుదీర్ఘ సిరీస్ జరుగనుంది. ఇరు జట్లకు ఇది చాలా కీలకమైన సిరీస్ అని చెప్పొచ్చు. జూన్ 20 నుంచి లీడ్స్‌లో జరిగే టెస్టుతో సిరీస్‌కు తెరలేస్తోంది. ఇంగ్లండ్ వంటి బలమైన జట్టుతో జరుగనున్న సిరీస్ టీమిండియాకు సవాల్‌గా మారింది. ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లపై భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారనే దానిపైనే జట్టు గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. ఈ సిరీస్‌లో టీమిండియా స్టార్ ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనుంది. రవిచంద్రన్ అశ్విన్, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, మహ్మద్ షమి వంటి సీనియర్ క్రికెటర్లు సిరీస్‌లో ఆడడం లేదు. అశ్విన్ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశారు. షమి ఫామ్‌లో లేకపోవడంతో సిరీస్‌కు ఎంపిక కాలేదు. ఇలా కీలక ఆటగాళ్లు దూరం కావడంతో టీమిండియా బలహీనంగా మారింది. ముఖ్యంగా విరాట్ లేని లోటును భర్తీ చేయడం భారత్‌కు చాలా కష్టంతో కూడుకున్న అంశంగా చెప్పాలి. భారత క్రికెట్‌పై తనదైన ముద్ర వేసిన విరాట్ అనూహ్యంగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. అతని లేని లోటు జట్టుపై స్పష్టంగా కనిపిస్తుందనే చెప్పాలి. ఎలాంటి బౌలర్‌నైనా సమర్థంగా ఎదుర్కొనే సత్తా కోహ్లికి ఉంది. అతను లేకుండా ఇంగ్లండ్ వంటి బలమైన జట్టును ఎదుర్కోవడం టీమిండియాకు సవాల్ వంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక రోహిత్ శర్మ కూడా అందుబాటులో లేకుండా పోవడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఫార్మాట్ ఏదైనా తన మార్క్ బ్యాటింగ్‌తో చెలరేగిపోవడం రోహిత్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఆడిరది కొన్ని టెస్టులే అయినా రోహిత్ జట్టుపై తనదైన ముద్ర వేశాడు. అతని సేవలు అందుబాటులో లేక పోవడం భారత్‌కు అతి పెద్ద లోటుగా చెప్పక తప్పదు. అశ్విన్ కూడా రిటైర్మెంట్ ప్రకటించడం జట్టును మరింత కలవరానికి గురి చేసే అంశమని చెప్పాలి. భారత క్రికెట్‌పై అశ్విన్ చెరగని ముద్ర వేశాడు. ముఖ్యంగా టెస్టుల్లో అశ్విన్‌కు కళ్లు చెదిరే రికార్డు ఉంది. పలు మ్యాచుల్లో జట్టుకు ఒంటిచేత్తో విజయం సాధించి పెట్టిన ఘనత అశ్విన్‌కు ఉన్న సంగతి తెలిసిందే. అతనిలాంటి స్పిన్నర్ దొరకడం చాలా కష్టంతో కూడుకున్న అంశమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. షమి వంటి స్టార్ బౌలర్ సేవలు కూడా జట్టుకు ఉండడం లేదు. ఇలా కీలక ఆటగాళ్లు లేకుండానే టీమిండియా టెస్టు సిరీస్ బరిలోకి దిగుతోంది.

## క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ ఓటమి
## ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్

సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి పోరాటానికి క్వార్టర్‌ఫైనల్లోనే తెరపడిరది. ఓ వైపు ఫిట్‌నెస్ సమస్యలు ఇబ్బంది పెడుతున్నా.. కఠిన ప్రత్యర్థులపై మెరుపు విజయాలు సాధిస్తున్న సాత్విక్, చిరాగ్‌లు ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్ నుంచి నిష్క్రమించారు. పురుషుల డబుల్స్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నం.7, మలేషియా జోడీ వీ చోంగ్, వున్ టీలు 2119, 2116తో భారత స్టార్స్‌పై విజయం సాధించారు. 43 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్‌లు ఆశించిన పోరాటం చేయలేదు. తొలి గేమ్‌లో 1110తో విరామ సమయానికి ఆధిక్యంలో నిలిచిన సాత్విక్, చిరాగ్‌లు ద్వితీయార్థంలో పట్టు కోల్పోయారు. 1717, 1919తో స్కోరు సమం చేసి మలేషియా షట్లర్లపై ఒత్తిడి పెంచినా.. 1921తో ఓటమి తప్పలేదు. రెండో గేమ్‌లో ఏమాత్రం పోటీ ఇవ్వలేని సాత్విక్, చిరాగ్‌లు చేతులెత్తేశారు. మలేషియా షట్లర్లతో గత నాలుగు మ్యాచుల్లో తిరుగులేని విజయాలు సాధించిన సాత్విక్, చిరాగ్‌లు తొలిసారి ఆ జోడీ చేతిలో పరాజయం చవిచూశారు. మెన్స్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్, చిరాగ్ ఓటమితో ఇండోనేషియా ఓపెన్‌లో భారత పోరాటం ముగిసింది.






## మా నాన్న టెస్ట్ క్రికెట్‌కు వీరాభిమాని!

భారత ఓపెనర్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. టెస్ట్‌లపై తన తండ్రికి ఉన్న ప్రేమను ఈ సందర్భంగా రోహిత్ గుర్తు చేసుకుంటూ, తండ్రి నిరాశ వ్యక్తం చేసినట్టు తెలిపాడు. అయినా తన క్రికెట్ ప్రయాణం అంతా చూశాక తండ్రి మద్దతుగా నిలిచారని చెప్పాడు. రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌లో 12 సెంచరీలు, 18 అర్ధ సెంచరీలతో గొప్ప కెరీర్‌కు ముగింపు పలికాడు. భారత క్రికెట్‌లో గొప్ప ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా పేరొందిన రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇంగ్లాండ్ పర్యటన కోసం జట్టు ఎంపికకు ముందు ఈ నిర్ణయం తీసుకున్న రోహిత్, టెస్ట్ క్రికెట్‌కు ఇక దూరంగా ఉండాలని ప్రకటించాడు. అతను బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తర్వాత ఉత్తమ ఫామ్‌లో లేకపోయినా టెస్ట్‌లను కొనసాగించాలన్న తన కోరికను బహిరంగంగా వెల్లడిరచగా, ఆ తర్వాత వచ్చిన ఈ రిటైర్మెంట్ వార్త వింతగా అనిపించింది. టెస్ట్ ఫార్మాట్‌కు తన సేవలు కొనసాగించాలని అంతకుముందు చెప్పిన రోహిత్, రంజీ ట్రోఫీలో కూడా తలపడి తాను ఇంకా క్రికెట్‌ను వదలలేదని చూపించాడు. అయితే, చివరకు బూట్లు తీయాలని నిర్ణయించడం అతని అభిమానులతోపాటు భారత క్రికెట్ వర్గాలను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది.ఈ నిర్ణయం రోహిత్ తండ్రిని కూడా నిరాశపరిచింది. ముంబైలో జరిగిన చతేశ్వర్ పుజారా భార్య పూజారా రాసిన 'ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' పుస్తక ఆవిష్కరణ సందర్భంగా రోహిత్ తన తండ్రి టెస్ట్ క్రికెట్‌పై ఉన్న అభిమానం గురించి వెల్లడిరచాడు. "నాన్న ఒక రవాణా సంస్థలో పనిచేశారు. మా కుటుంబ జీవితం కోసం చాలా త్యాగాలు చేశారు. కానీ ఆయన మొదటి రోజు నుండి టెస్ట్ క్రికెట్‌కు వీరాభిమానిగా ఉన్నారు. ఆయనకు ఈ కొత్త తరం క్రికెట్ - టీ20లు, ఫ్రాంచైజీ లీగ్స్ అంతగా నచ్చవు. నేను వన్డేలో 264 పరుగులు చేసినప్పుడు కూడా ఆయన పెద్దగా స్పందించలేదు. కానీ టెస్టుల్లో నేను చేసిన 30, 40, 50 స్కోర్లపైనా ఆయనతో పొడవుగా చర్చించేవారు. అతనికి ఉన్న ప్రేమ అది," అని రోహిత్ పేర్కొన్నాడు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించినప్పుడు తన తండ్రి కొంత నిరాశకు లోనైనట్టు రోహిత్ తెలిపాడు. అయితే, తన ప్రయాణం పూర్తిగా చూశాడు కాబట్టి చివరకు ఆయన కూడా ఆనందంగా మద్దతు ఇచ్చినట్టు పేర్కొన్నాడు.

## క్రికెట్‌కు పీయూష్ చావ్లా గుడ్‌బై





టీమిండియా సీనియర్ ఆటగాడు పీయూష్ చావ్లా అన్ని ఫార్మాట్‌ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని శుక్రవారం చావ్లా ఇన్‌స్టా వేదికగా ప్రకటించాడు. 36 ఏళ్ల పీయూష్ మూడు ఫార్మాట్‌లలోనూ భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. 2007లో టి20 వరల్డ్‌కప్, 2011 వన్డే ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. కెరీర్‌లో చావ్లా 3 టెస్టులు, 25 వన్డేలు, 7 టి20 మ్యాచ్‌లు ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చావ్లాకు ఎక్కువ అవకాశాలు లభించలేదు. అయితే దేశవాళీ క్రికెట్‌లో మాత్రం మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. కెరీర్‌లో 446 ఫస్ట్ క్లాస్ వికెట్లు, మరో 319 టి20 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. చావ్లా దేశవాళీ క్రికెట్‌లో ఉత్తరప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహించాడు. అంతేగాక ఐపిఎల్‌లో పలు ఫ్రాంచైజీల తరపున ఆడాడు. 2012, 2014లలో ఐపిఎల్ ట్రోఫీలు సాధించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో చావ్లా ఉన్నాడు.

## ఫైనల్లో అల్కరాస్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



డిఫెండిరగ్ ఛాంపియన్, రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) వరుసగా రెండో ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఎనిమిదో సీడ్, ఇటలీ ఆటగాడు లొరెంజో ముసెటితో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 46, 76(73), 60, 20తో పైచేయి సాధించిన అల్కరాస్ టైటిల్ పోరుకు చేరుకున్నాడు. తొలి సెట్‌లో పైచేయి సాధించిన ముసెటి.. రెండో సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయాడు. మూడో సెట్‌ను 60తో అల్కరాస్ అలవోకగా సొంతం చేసుకున్నాడు. నాల్గో సెట్లో 20తో అల్కరాస్ ముందంజలో నిలువగా.. తొడ కండరాల గాయంతో లొరెంజో ముసెటి వాకోవర్ ఇచ్చాడు. మూడో సెట్‌లోనే గాయంతో ఇబ్బంది పడిన ముసెటి.. నాల్గో సెట్లో రెండు గేముల తర్వాత.. ఆడలేనని చెప్పేశాడు. ఓ ఏస్, ఆరు బ్రేక్ పాయింట్లు సాధించిన కార్లోస్ అల్కరాస్ పాయింట్ల పరంగా 10479తో తిరుగులేని ఆధిపత్యం చూపించాడు. పురుషుల సింగిల్స్ మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ జానిక్ సినర్, ఆరో సీడ్ నొవాక్ జకోవిచ్ తలపడుతున్నారు. ఇక నేడు జరుగనున్న మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో వరల్డ్ నం.1 అరినా సబలెంక, రెండో సీడ్ కొకొ గాఫ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో నాలుగు సార్లు ఛాంపియన్ ఇగా స్వైటెక్‌ను సెమీస్‌లో చిత్తు చేసిన సబలెంక నేడు ఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.



# ఇక భారమంతా నీదేరా


జూన్ నెల వారానికో ప్యాన్ ఇండియా సినిమాతో కళకళలాడుతుందనుకుంటే దానికి భిన్నంగా థగ్ లైఫ్ బోణీ డిజాస్టర్ కావడం, జూన్ 12 రావాల్సిన హరిహర వీరమల్లు వాయిదా పడటం ఇండస్ట్రీ వర్గాలకు షాకిచ్చాయి. ఇక నుంచి థియేటర్లు జనంతో నిండిపోతాయనుకుంటే దానికి భిన్నంగా ఇంకో రెండు వారాలు మూసేస్తే నయమనే భావనలో ఎగ్జిబిటర్లు ఉన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పర్సెంటేజ్ లు, రెంట్లు తర్వాత అసలు ఈ వ్యాపారమే వద్దనుకుంటున్న వాళ్ళ లిస్టు పెరిగేలా ఉంది. ఈ నేపథ్యంలో జూన్ 20 వైపు అందరి దృష్టి వెళ్తోంది. కుబేర విడుదల కాబోతున్న నేపథ్యంలో భారమంతా దాని మీదే ఉంది.నా సామిరంగ తర్వాత నాగార్జున తెరమీద కనిపించనున్న సినిమా ఇదే. ఏడాదిన్నర పైగా గ్యాప్ రావడంతో అక్కినేని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ధనుష్ మెయిన్ హీరో అయినప్పటికీ ప్రాధాన్యత పరంగా ఇద్దరినీ బాలన్స్ చేసి ఉంటారనే నమ్మకం ట్రైలర్ తో వచ్చింది. అందులోనూ కథను నిజాయితీగా చూపించే శేఖర్ కమ్ముల దర్శకుడు కాబట్టి అది మరింత ఎక్కువగా ఉంది. రష్మిక మందన్న, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, డబ్బు క్రైమ్ తో ముడిపడిన విభిన్నమైన నేపథ్యం, తదితరాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అందులోనూ రాజీ లేకుండా ఎక్కువ కాలం నిర్మాణం జరుపుకున్న చిత్రమిది. ఇప్పుడు టాలీవుడ్ బాక్సాఫీస్ కు ఊపిరి ఊదాల్సిన బాధ్యత కుబేర మీద ఉంది. ఒక బిచ్చగాడు కోటీశ్వరుడు అయ్యే క్రమంలో ఎదురయ్యే సామజిక రాజకీయ పరిస్థితుల ఆధారంగా శేఖర్ కమ్ముల దీన్ని తెరకెక్కించారు. పాటలు వేటికవే వైవిధ్యంగా అనిపిస్తున్నాయి. కంటెంట్ కనక క్లిక్ అయితే కుబేరకు వసూళ్ల వర్షం ఖాయం.



## బన్నీ-అట్లీ.. అప్‌డేట్ రెడీ

గత ఏడాది పుష్ప: ది రూల్ చిత్రంతో భారీ విజయాన్నందుకున్నాడు అల్లు అర్జున్. దీని తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చారిత్రక నేపథ్యంలో సాగే సినిమా చేయాల్సింది బన్నీ. కానీ అది వెనక్కి వెళ్లి.. దాని స్థానంలోకి అట్లీ చిత్రం వచ్చింది. రొటీన్ మాస్ మసాలా సినిమాలు తీసే అట్లీతో సినిమా ఏంటి అని ముందు బన్నీ ఫ్యాన్స్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు కానీ.. ఈ సినిమా ప్రి విజువలైజేషన్ వీడియో వచ్చాక మాత్రం వారి ఆలోచన మారింది. అట్లీ ఈసారి హాలీవుడ్ స్థాయి సైఫై థ్రిల్లర్ ఏదో ట్రై చేస్తున్నాడని.. ఈ సినిమా లేవెలే వేరుగా ఉండబోతోందని ఆ వీడియో సంకేతాలు ఇచ్చింది. ఈ సినిమా నుంచి ఇప్పుడు తర్వాతి అప్‌డేట్ రెడీ అయింది. శనివారం ఉదయం 11 గంటలకు ఆ అప్‌డేట్‌ను పంచుకోనున్నట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బన్నీఅట్లీ సినిమా నుంచి రాబోతున్న అప్‌డేట్ హీరోయిన్ గురించే అని సమాచారం. ఇటీవలే సందీప్ రెడ్డి వంగప్రభాస్‌ల చిత్రం స్పిరిట్ నుంచి అనూహ్య పరిస్థితుల్లో వైదొలిగిన దీపికా పదుకొనేను బన్నీకి జోడీగా తీసుకుంటున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడా విషయాన్నే అధికారికంగా ప్రకటించబోతున్నారట. మరి దీపిక ఈ సినిమాలో భాగం కానున్నట్లు జస్ట్ సమాచారం ఇస్తారా.. లేక ఆమె ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేస్తారా అన్నది చూడాలి. ఈ చిత్రంలో ఇంకో ఇద్దరు స్టార్ హీరోయిన్లకు చోటు ఉంది. అందులో ఒకరు జాన్వి కపూర్ కాగా.. మరొకరు మృణాల్ ఠాకూర్ అని వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రంలో బన్నీ త్రిపాత్రాభినయం చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. మూడు పాత్రలకు ముగ్గురు హీరోయిన్లు జోడీ అన్నమాట.

# త్రిషను ఇలా చూపకండి ప్లీజ్




తాజాగా విడుదలైన థగ్ లైఫ్ లో త్రిష పాత్రను చూశాక అభిమానుల నుంచి ముక్తకంఠంతో వినిపిస్తున్న కోరిక ఇదొక్కటే. విడుదలకు ముందు ట్రైలర్ చూశాక తను కమల్ హాసన్ తో రొమాన్స్ చేయడం గురించి సోషల్ మీడియాలో రకరకాల కామెంట్స్, మీమ్స్ వచ్చాయి. ఇదే విషయం తనను ఇంటర్వ్యూలో అడిగితే తెరమీద చూడండి, థ్రిల్ అయ్యే ట్విస్టు ఉంటుందని చెప్పింది. తీరా చూస్తే ఇటు కమల్ అటు శింబు ఇద్దరితో రొమాన్స్ పెట్టిన దర్శకుడు మణిరత్నం అసలేం చెప్పాలనుకున్నాడో ఎంత బుర్రలు బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. పైగా త్రిష క్యారెక్టర్ కిచ్చిన ఎండిరగ్ చూశాక నోటమాట రావడం కష్టమే.సెకండ్ సెటప్, వేశ్యగా స్టార్ హీరోయిన్లను చూపించడం కొత్త కాదు. ఆ మాటకొస్తే వేదంలో అనుష్క ఎంత అద్భుతంగా పెర్ఫార్మ్ చేసిందో ఎవరూ మర్చిపోలేం. కానీ థగ్ లైఫ్ లో త్రిషకు అంత స్కోప్ దొరకలేదు. అసలు మణిరత్నం టేస్ట్ ఇంతగా పడిపోయిందా అని చెప్పేందుకు ఒక చిన్న ఉదాహరణ చెప్పాలి. జైలు నుంచి బయటికి వచ్చిన కమల్ హాసన్ మూడు రోజులు త్రిష ఇంట్లోనే గడుపుతాడు. వాళ్ళ బంధం గురించి బయట వృద్ధురాలైన వడవుక్కరసి వర్ణించడం వింటే బి గ్రేడ్ కంటే అన్యాయంగా ఉంటాయి. అసలీ పాత్ర లేకపోయినా కథకు ఎలాంటి ఇబ్బంది లేదు అనేలా త్రిషని చూపించడం ట్రాజెడీ. సరే తమిళంలో ఎలా చూపించినా ఓకే కానీ త్రిష నుంచి నెక్స్ట్ రాబోయే సినిమా విశ్వంభర. చిరంజీవి హీరో అందులోనూ ఫాంటసీ మూవీ కనక తగినంత ప్రాధాన్యం దక్కి ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇప్పటికే గుడ్ బ్యాడ్ అగ్లీతో ఓ మోస్తరు హిట్ థగ్ లైఫ్ తో అల్ట్రా డిజాస్టర్ అందుకున్న త్రిషకు మెగా మూవీ ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి. దీంతో పాటు మోహన్ లాల్ తో కలిసి నటించిన రామ్ కూడా లైన్ లో ఉంది. కాకపోతే షూట్ ఇంకా బాలన్స్ ఉంది. పొన్నియిన్ సెల్వన్ లో ఎంతో అందంగా చూపించిన మణిరత్నమే ఇప్పుడీ థగ్ లైఫ్ ఇంత చెత్తగా చూపించడాన్ని సగటు ప్రేక్షకులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు.

## 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు'



యస్.యం.4 ఫిలిమ్స్ బ్యానర్ పై గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ నటీనటులుగా యం.యన్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు'. ఈ చిత్ర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన దర్శకులు వి.సముద్ర కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకులు వీరశంకర్ క్లాప్ ఇచ్చారు. దర్శక, నిర్మాత సాగర్ మాట్లాడుతూ, 'నేను తీసిన 'కాలం రాసిన కథలు' సినిమాకు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఆ ఉత్సాహంతోనే దానికి సీక్వెల్‌గా 'బ్యాచ్‌లర్స్ ప్రేమ కథలు' సినిమా తీస్తున్నాను. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు మంచి సోషల్ మెసేజ్ ఇవ్వబోతున్నాను. అలాగే ఈ చిత్రంతో నూతన నటీనటులను ఇండిస్టీకి పరిచయం చేస్తున్నాను. ఈ నెలలోనే షూటింగ్ స్టార్ట్ చేస్తాం. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం' అని తెలిపారు. 'అందరూ నా పాత్రకు కామెడీ ఎక్స్పెక్ట్ చేస్తారు. కానీ అందుకు భిన్నంగా ఈ సినిమాలో ఎమోషనల్ పాత్ర చేయ బోతున్నాను. ఈ సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాత సాగర్‌కి థ్యాంక్స్' అని నటి గీతా సింగ్ చెప్పారు. నటుడు కార్తీక్ మాట్లాడుతూ,'యూత్ మెచ్చే మంచి మెసేజ్ ఉన్న ఇలాంటి సినిమా ద్వారా ఇండిస్టీకి పరిచయం చేస్తున్న సాగర్‌కి నా ధన్యవాదాలు' అని అన్నారు. ఈ చిత్రానికి డిఓపి : ప్రసాద్ ఎస్, మ్యూజిక్ : మెరుగు అరమాన్, ఎడిటర్ : నందమూరి హరి.

## మణిరత్నం తొలిసారి ఆ ఫీలింగ్ కలిగించాడు



లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం గొప్పదనం గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. 38 ఏళ్ల కిందటే 'నాయకన్' లాంటి ఆల్ టైం క్లాసిక్ అందించిన దర్శకుడాయన. ఆ తర్వాత రోజా, బొంబాయి, సఖి, ఇద్దరు, యువ.. ఇలా ఎన్నో ఆణిముత్యాలను అందించిన ఘనుడాయన. ఐతే ఎలాంటి దర్శకుడికైనా ఒక దశ దాటాక పరాజయాలు రావడం సహజం. మణిరత్నం కూడా అందుకు మినహాయింపు కాలేకపోయారు. రావణ్, కడలి, చెలియా లాంటి చిత్రాలు ఆయనకు చేదు అనుభవం మిగిల్చాయి. ఐతే మణిరత్నం ఫ్లాప్ సినిమాలు తీస్తే తీసి ఉండొచ్చు కానీ.. ఆ చిత్రాలు ఏవీ ఆయన ఔట్ డేట్ అయిపోయాడు అనే ఫీలింగ్ మాత్రం కలిగించని మాట వాస్తవం. 'చెలియా' సినిమా పరమ బోరింగ్‌గా అనిపించినా.. దాన్ని ట్రెండీగానే తీశారు మణిరత్నం. ఇదేం ముతక కథ.. ఇవేం రొటీన్ సన్నివేశాలు అనిపించలేదు. ఆ తర్వాత ఆయన్నుంచి వచ్చిన 'పొన్నియన్ సెల్వన్'లో కూడా అలాంటి ఫీలింగ్ కలగలేదు. కానీ ఇన్నేళ్ల కెరీర్లో మణిరత్నం ఔట్ డేట్ అయిపోయాడు అని ఆయన అభిమానులకు ఫస్ట్ టైం ఒక ఫీలింగ్ కలిగించిన సినిమా బహుశా 'థగ్ లైఫ్'యేనేమో. తాను తీసిన ఫ్లాప్ సినిమాలతో కూడా గౌరవం సంపాదించుకున్న దర్శకుడాయన. కొన్ని ఎపిసోడ్లలో అయినా మెరుపులు మెరిపించేవారు. కానీ 'థగ్ లైఫ్' మాత్రం అందుకు మినహాయింపు. ట్రైలర్ చూస్తే భలేగా అనిపించింది కానీ.. సినిమాగా మాత్రం ఇది తీవ్రంగా నిరాశపరిచింది. ఇండియన్ స్క్రీన్ మీద ఎన్నో సార్లు చూసి.. అరిగిపోయిన రొటీన్ గ్యాంగ్ స్టర్ డ్రామా కథను ఎంచుకుని.. దాన్ని అంతే రొటీన్ స్క్రీన్ ప్లేతో నడిపించి తన అభిమానులకు పెద్ద షాకే ఇచ్చాడు మణిరత్నం. ముఖ్యంగా సెకండాఫ్ చూస్తుంటే చాలామందికి 'ఇండియన్2' గుర్తుకొచ్చింది. ఇంత రొటీన్‌గా, బోరింగ్‌గా సీన్లు ఎలా తీయగలిగారు అని ఆశ్చర్యం కలిగించింది. పూర్తిగా ఔట్ ఆఫ్ ఆర్డర్ అనిపించారు మణిరత్నం. దీంతో ఫ్యాన్స్ సైతం ఇక ఆయన సినిమాలు మానేస్తే మంచిదనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in